TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 58 నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ . గురువారం 15 జనవరి 2026 వెల 4:00

# ములుగు జిల్లా రద్దు చేయం

## మంత్రి సీతక్క క్లారిటీ

**హైదరాబాద్, జనవరి 14 (నిజాయితీ) :** తెలంగాణలో జిల్లాల పునర్విభజన చేపడతామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఈ జిల్లాలను ఏర్పాటు చేసిందని, రాబోయే రోజుల్లో హేతుబద్ధంగా పునర్విభజన చేపడతామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దీనికోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్వరలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో పలు జిల్లాలు రద్దు అవుతాయని విస్తృతంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా కూడా రద్దవుతోందని ప్రచారం జరుగుతున్న క్రమంలో ఈ ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు.

"ములుగు జిల్లా ఏర్పాటు కోసం పోరాడిన వాళ్లం. అలాంటిది ములుగు జిల్లాను ఎందుకు రద్దు చేస్తాం..? టీఆర్ఎస్ హయంలో నూతన జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగింది. పాలనా సౌలభ్యాన్ని పట్టించుకోకుండా, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా అస్తవ్యస్తంగా జిల్లాల సరిహద్దులను నిర్ణయించారు. ఒక మండలం మొత్తం ఒకే జిల్లాలో ఉండాలన్నది ప్రజల కోరిక" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

"ములుగు జిల్లాలో ఒక మండలం ఉంటుంది. అందులోని ఐదు గ్రామాలు పక్కన భూపాలపల్లి జిల్లాలో ఉంటాయి. అలాంటప్పుడు ప్రజలకు పాలనా ఫలాలు ఎలా అందుతాయి. రెవెన్యూ, పోలీసు సరిహద్దులు ఒకేలా ఉండాలి. కానీ ఆ విధానాన్ని కేసీఆర్ అవలంబించలేదు. దీంతో జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు రెండు జిల్లాల కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అభివృద్ధి పరమైన సమీక్ష సమావేశాల సంబంధించి ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల సరిహద్దు విషయంలో స్వల్ప మార్పులు ఉంటాయని సీఎం గారు చెప్పారు" అని మంత్రి సీతక్క తెలిపారు.

"ములుగు జిల్లా ఏర్పాటు నచ్చని వాళ్లే ములుగు జిల్లా రద్దవుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ములుగు జిల్లా ప్రజలు నమ్మి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తుంది.



అలాంటప్పుడు ములుగు జిల్లా రద్దు అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. ములుగు ప్రజలు ఎవరు ఆందోళన పడొద్దు. ములుగు జిల్లా ఎక్కడికి పోదు.. ఇక్కడే ఉంటుంది.. అభివృద్ధి పథంలో అగ్ర భాగాన నిలుస్తుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు

# జర్నలిస్టుల అరెస్ట్..


## రాహుల్ గాంధీకి కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్, జనవరి 14(నిజాయితీ) :** ఓ కథనానికి సంబంధించిన కేసులో హైదరాబాద్ పోలీసులు ముగ్గురు ఎన్టివి జర్నలిస్టులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అక్రమ అరెస్టులను బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఖండించారు. ఈ అరెస్టులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలన ప్రతిసారీ ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోందని.. జర్నలిస్టులను నేరస్థులుగా చూడటం దురదృష్టకరమని కెటిఆర్ అన్నారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలవచ్చు కదా? అర్ధరాత్రి ఇళ్లల్లోకి వెళ్లి అతిగా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తెలంగాణలో 'అరకు' ను మించిన అందాలు

**జమ్మూకాశ్మీర్, జనవరి 14 (నిజాయితీ) :** తెలంగాణలో అనేక పర్యటక ప్రాంతాలు ఉన్నాయి. జలపాతాలు, వైల్డ్ లైఫ్ శాంక్చురీలు, పార్కులు, ఉద్యానవనాలు, అటవీ ప్రాంతాలు అనేకం పర్యటకులను ఆకర్షిస్తున్నాయి. అయితే చుట్టూ పచ్చని కొండల మధ్య జంగిల్ సఫారీకి టూరిస్టులు ఇప్పుడు క్యూ కడుతున్నారు. ఇక్కడి వాతావరణం చూస్తే ఏపీలోని అరకును తలపిస్తుంది. అయితే టూరిస్టుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని దాదాపు 20 కి. మీ. మేర అటవీ ప్రాంతంలో సంచరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అదే మంచిర్యాల జిల్లాలోని గఢ్ పూర్ జంగిల్ సఫారీ..



మంచిర్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఈ జంగిల్ సఫారీ పర్యటకులను కనువిందు చేస్తోంది. ఎత్తయిన కొండలు, పచ్చని దట్టమైన అటవీ ప్రాంతాల మధ్య రహదారి ప్రయాణం అక్కడక్కడా పులులతోపాటు ఇతర జంతువులు కూడా కనువిందు చేస్తుంటాయి. ఇదే గఢ్ పూర్ జంగిల్ సఫారీ ప్రత్యేకత. అందుకే చాలా మంది ఈ ప్రాంతాన్ని ఏపీలోని అరకు అందాలతో పోల్చుతారు. ఇక్కడకు వెళ్తే అరకు అందాలను చూసిన ఫీలింగ్ కలుగుతుందని పర్యటకులు చెబుతున్నారు.

మంచిర్యాల పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో దాదాపు 20 కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ జంగిల్ సఫారీ ఉంది. ఈ గఢ్ పూర్ జంగిల్ సఫారీకి పర్యటకులు ఇటీవలి కాలంలో అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు 20 కిలోమీటర్ల మేర అడవిలో విహరించే విధంగా పలు ఏర్పాట్లు చేసింది. దాంతో ఇటీవలి కాలంలో మరింత సంఖ్యలో పర్యటకులు విచ్చేస్తున్నారు. ఈ అటవీ ప్రాంతం కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో భాగంగా ఉంది. ఇక్కడ పులులు, చిరుతలు ఎక్కువగా సంచరిస్తున్నాయి.


# బీజేపీ ఎంపి రవిశంకర్ ప్రసాద్ నివాసంలో అగ్ని ప్రమాదం



**న్యూఢిల్లీ, జనవరి 14 (నిజాయితీ) :** బీజేపీ ఎంపి రవిశంకర్ ప్రసాద్ అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీలోని 21, మదర్ థెరిసా క్రెసెంట్ రోడ్డులో ఉన్న రవిశంకర్ నివాసంలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఇంటిలోని ఒక గదిలో ఉన్న మంచంపై మంటలు చెలరేగాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ సంభవించలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఎంపీ ఇంట్లో ఉన్నారా లేదా అనేది తెలియరాలేదు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు.. ఢిల్లీ పోలీసుల ఫోరెన్సిక్ బృందాన్ని ఎంపి నివాసానికి పంపారు. అ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

# ఘోర ప్రమాదం..

## రైలుపై క్రేన్ పడి 22 మంది మృతి



**థాయిలాండ్, జనవరి 14 (నిజాయితీ) :** ఈశాన్య థాయిలాండ్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఎలివేటెడ్ హై-స్పీడ్ రైల్వే ప్రాజెక్టులో పనిచేస్తున్న నిర్మాణ క్రేన్ కదులుతున్న ప్యాసింజర్ రైలుపై కూలిపోవడంతో 22 మంది మరణించారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, రైలు బ్యాంకాక్ నుండి ఉబోన్ రాట్చథాని ప్రావిన్స్‌కు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. క్రేన్ జారీ ప్రయాణిస్తున్న రైలుపై పడిపోవడంతో బోగీలు పట్టాలు తప్పి బోల్తా కొట్టాయి. దీంతో మంటలు చెలరేగి పెద్ద ప్రమాదానికి దారితీసింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించాయి. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఘటనాస్థలం నుంచి నాలుగు మృతదేహాలను బయటకు తీశారు. రైలు లోపల చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అత్యవసర సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు త్వరలో ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

# రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు - సిఎం రేవంత్



**హైదరాబాద్, జనవరి 14 (నిజాయితీ) :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగ సందడి ఆరంభమైంది. నేడు భోగి పండగను వైభవంగా జరుపుకొంటోన్నారు. ఈ తెల్లవారు జామున భోగి మంటలు వెలిశాయి. రంగవల్లులతో తెలుగు లోగిళ్లు సరికొత్త అందాలను సంతరించుకున్నాయి. కోడిపందేలు, గంగిరెద్దుల ఆటలతో ఈ వారం అంతా కూడా ఏపీ, తెలంగాణల్లో పండగ కోలాహలం కొనసాగనుంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన ఆప్తులతో ఆయా కుటుంబాలు, ప్రత్యేకించి పల్లె ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. సంక్రాంతి పండగ సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబానికి శ్రేయస్సు, సుఖ సంతోషాలను తీసుకు వచ్చే భోగి పండగ.. కొత్త వెలుగులు, ఆశలను తీసుకువచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి తెలుగు కుటుంబంలో పండగ కాంతులు వెల్లివిరియాలని కోరారు.తన ప్రభుత్వ అమలు చేస్తోన్న అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాల గురించి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి చేరేలా చూడడమే ప్రజా ప్రభుత్వ దృఢ సంకల్పమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, తయారీ, సేవల రంగంలో తెలంగాణ అసమానమైన పురోగతిని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ.. దేశంలో అగ్రగామి అవుతుందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047ను సాకారం చేసుకోవడానికి ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. గొప్ప తెలుగు సంప్రదాయాలు, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గాలిపటాలను ఎగురవేసేటప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కూడా రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గాలిపటాల ఎగురవేతపై ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు, విద్యుత్ సిబ్బంది పలు సూచనలను ఇచ్చారు.

గురువారం
జనవరి 15, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా గోదాదేవి కల్యాణం...



**వట్టెం, జనవరి 14 (నిజాయితి) :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని వట్టెం దేవాలయంలో ధనుర్మాసం ప్రత్యేక పూజల కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు గోదాదేవి కళ్యాణం వేదమూర్తులైన బ్రాహ్మణులచే వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు , నవీన్ స్వామి , నరసింహ చార్యులు, తివారి,ల ఆధ్వర్యంలో వేదమూర్తులైన బ్రాహ్మణులచే వేదమంత్రో చరణాల మధ్య శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణంలో విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యా వచనం, మధుపర్కం,మంగళాష్టకాలు, కన్యాదానం,జిలకర బెల్లం,మహా సంకల్ప పఠనం,మాంగల్య ధారణ,తలంబ్రాలు వేద ఆశీర్వచనం వేదమంత్రచరణల మధ్య చేశారు. గోదా రంగనాయక స్వామి వార్లకు సమర్పించిన తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేశారు. కళ్యాణం లోపాల్గొన్న భక్తులందరికీ చిన్నారి సాన్విసింగ్ నృత్యం ఎంతగానో అలరించింది . తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు దంపతులు, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి దిలీపాచారి రాష్ట్ర సభ్యుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, . ఆలయ వ్యవస్థాపక సభ్యుడు ప్రతాప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారి దేవేందర్ రెడ్డి , వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బండారు రాజశేఖర్ , బిజెపి జిల్లా మహిళా నేత మ్యాకం చంద్ర కల,సర్పంచ్ జ్యోతి, జక్ పాల్ రెడ్డి, చంద్రా రెడ్డి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన వందలాది మంది భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దేవస్థాన నిత్యాన్నప్రసాద ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

# మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

## ఐద్వా జిల్లా కార్యదర్శి కె. గీత




**నాగర్‌కర్నూల్, జనవరి 14 (నిజాయితి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని 23వ వార్డు రాఘవేంద్ర కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కందికొండ గీత మాట్లాడుతూ మహిళల్లో పిల్లల్లో ఎంతో సృజనాత్మక శక్తి ఉంటుందని దాన్ని వెలికి తీసే ప్రయత్నంలో ఇది ఒక భాగమేనని తెలిపారు అంతేకాక ఆడపిల్లల్ని పుట్టనిద్దాం చదవనిద్దాం ఎదగనిద్దాం బ్రతకనిద్దాం అంటూ ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాలను వ్యతిరేకించాలని తెలిపారు పేదవారికి ఆర్థిక స్తోమత తగ్గిపోయి ఉన్నవారికి ఎస్సీ ఎస్టీలకు బీసీలకు అది చదువుకున్నంత కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వాలు ఉచిత విద్యను వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వాలు అందించాలని కోరారు అలాగే సమాన పనికి సమాన వేతనం మహిళలకు కూడా ఉండాలని తెలిపారు ఇంట్లో గృహిణిలు ఎంతో శ్రమ చేస్తారని ఆశ్రమకు అసలు గుర్తించలేదని తెలియజేశారు వాళ్ళ శ్రమ ని ఇంటిలో వాళ్లు సమాజం ప్రభుత్వాలు గుర్తించాలని తెలిపారు అంతేకాక మహిళల హక్కులు నిదావిధిగా అమలు చేయాలని వారికి చదువుకునే హక్కు ఉద్యోగం చేసే హక్కు అమలు చేయాలని మరియు భూమిపై హక్కు కల్పించాలని గీత కోరారు మహిళలను బయటకి రాకుండా వంటింటికే పరిమితం చేయాలనుకునే మనువాదాన్ని మహిళలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతగా నిర్మల టీచర్ గారు వ్యవహరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు కాలనీవాసులు అంజనమ్మ నవనీత స్వాతి మల్లీశ్వరి యామిని ఉమా ఉష శ్రీదేవి మొదలగువారు పాల్గొన్నారు

# ఈనెల19 నుండి 23 వరకు శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ15వ వార్షిక బ్రహ్మోత్సవాలు....



**నాగర్‌కర్నూల్, జనవరి 14 (నిజాయితి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు జ్ఞాన సరస్వతి దేవాలయంలో మాఘశుద్ధ పాడ్యమి నుండి మాఘ శుద్ధ పంచమి వరకు ఈనెల19 నుండి 23వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు జ్ఞాన సరస్వతి దేవాలయ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు తెలిపారు.గత 14సంవత్సరాల నుండి ప్రతిరోజు దేవాలయంలో గోపూజ,అమ్మవారికి త్రికాల పూజలు జరుగుతున్నట్లు తెలిపారు.ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19న మహాభిషేకం,అఖండ దీపారాధన,గోపూజ,గణపతి పూజ,పుణ్యావాచనం, రక్షాబంధనం,పంచగవ్య ప్రాశనం,మండపారాధన, నవగ్రహ మండప అంకురార్పణ,మండప పూజలు,ప్రత్యేకంగా గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 20న మంగళవారం నాడు సరస్వతి అమ్మవారికి మూలవిరాట్ కు సామూహిక అభిషేకాలు, గోకల్యాణము,తులాభారం,ఓం శ్రీ రక్ష కోలాట బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈనెల 21న బుధవారం నాడు ఉత్సవ విగ్రహానికి పాఠశాల విద్యార్థులచే సామూహిక అభిషేకాలు,శ్రీ గాయత్రి హోమము, దైవభక్తి -దేశభక్తి పాటల కచేరీ కార్యక్రమము ఉన్నట్లు తెలిపారు.ఈనెల 22న గురువారం నాడు శ్రీ గురు దత్తాత్రేయ హోమము,9గంటలకు చండి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సాయంత్రం4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న మాఘ శుక్ల పంచమి,మాఘ పంచమినాడు అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా బాలగోమాతకు డోలారోహణం,ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 23న చిన్నారులకు విశేష అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నామని అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు.గణపతి హోమం,చండీ హోమం, గాయత్రి హోమం,నవగ్రహ హోమం,గోకళ్యాణం ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొనే భక్తులు,దంపతులు సాంప్రదాయ దుస్తులలో పాల్గొనాలని వారు కోరారు. వివరాలకు 6301083132, 9949031319 లలో సంప్రదించలని వారు కోరారు. ప్రతిరోజు మధ్యాహ్నము 12 గంటలకు అమ్మవారికి పల్లకి సేవ దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం జ్ఞాన సరస్వతి దేవాలయ సేవా ట్రస్టు ద్వారా పాల్గొన్న భక్తులందరికీ నిత్య అన్న ప్రసాద పంపిణీ ఉన్నట్లు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# పాలెం వెంకన్న దేవాలయంలో వైభవంగా గోదాదేవి కళ్యాణోత్సవం...



**బిజినపల్లి, జనవరి 14 (నిజాయితి) :** బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నాడు భోగి సందర్భంగా గోదాదేవి రంగ నాయక స్వామి వార్ల కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగినది.గత నెల రోజులుగా దేవాలయంలో జరిగిన ధనుర్మాస ప్రత్యేక పూజలు పూసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజ చార్యులు తెలిపారు. ప్రతిరోజు తెల్లవారుజామున గోవింద నామాస్మరణతో గోవింద నామాలతో మార్మోగినది.చివరి రోజు అంగరంగ వైభవంగా గోదా కళ్యాణం నిర్వహించడం జరిగినది.ఆలయ ధర్మకర్త మనుసాని విష్ణుమూర్తి ఆలయ ఈవో సిహెచ్ రంగారావు పర్యవేక్షణలో అర్చకులు జయంత్,శుక్లా, వేణుగోపాల్,చక్రవర్తి లు వేదమంత్ర చరణాల మధ్య కళ్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదలతో పాటు గోదా దేవి కళ్యాణానికి విచ్చేసినటువంటి భక్తులకు అన్నప్రసాదనీ సోప్పరి రాములు కృష్ణమ్మ దంపతులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బండారుజగదీష్ దేవాలయ సిబ్బంది బాబయ్య,శివ కుమార్,పురుషోత్తం,భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటేశ్వర కాలనీ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు.

# ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి




**నాగర్‌కర్నూల్, జనవరి 14 (నిజాయితి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకటేశ్వర కాలనీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని, ప్రతి పండుగ వెనుక ఎంతో పరమార్థం ఉంటుందని సంక్రాంతి పండుగ రైతుల పండుగ అని తెలియజేస్తూ నాగర్ కర్నూల్ నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు రంగవల్లులలో చక్కటి ప్రతిభ చూపిన మహిళలను అభినందించారు 2026 సంవత్సరము కాలనీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాలనీ యొక్క కార్యవర్గాన్ని అభినందించారు. రంగవల్లుల పోటీలలో ప్రథమ బహుమతి నాగలక్ష్మి ద్వితీయ బహుమతి సుస్మిత తృతీయ బహుమతి శ్రీదేవి అందుకున్నారు వీరికి మహా వేద్ హాస్పిటల్ మరియు అమ్మ హాస్పిటల్ డాక్టర్స్ పూర్ణిమ నరేన్ నగదు బహుమతులు స్పాన్సర్ చేశారుపాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు అధ్యక్షులు సుక్కాయిపల్లి లక్ష్మణ్ కార్యదర్శి దశరథము కోశాధికారి సతీష్ కుమార్
మరియు నర్సిని దత్తాత్రేయులు శ్రీని వాసులు కృష్ణయ్య, బాలరాజు సురేంద్ర కుమారు సురేందర్ రెడ్డి భాస్కర్ రెడ్డి వెంకటేశ్వర్లు సుధీర్ రమేష్ లక్ష్మీ నరసింహ గౌడ్ చంద్రమోహన్ రెడ్డి లక్ష్మారెడ్డి నీ రేష్ బాబు రామ్మోహన్ మహిళ కార్యదర్శులు రేవతి మంజుల యమునా జ్యోతి కాలనీ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# సంక్రాంతి పండుగ సందర్భంగా అంతరాష్ట్ర ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటీల ప్రారంభం



**నాగర్‌కర్నూల్, జనవరి 14 (నిజాయితి) :** నాగర్ కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న అంతరాష్ట్ర ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటీలను మన ప్రియతమ నేత, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి గారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ఒంగోలు జాతి పశు వులు తెలుగు రైతుల గర్వకారణమని, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ జాతి పరిరక్షణకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. రైతులు పశుపోషణను వృత్తిగా అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ పశుబల ప్రదర్శన పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ రైతులు, పశుపోషకులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి కర్ణాకర్ రెడ్డి గారు ,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, పశుపోషకులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు



**తిమ్మాజిపేట, జనవరి 14 (నిజాయితి) :** తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లి గ్రామంలో గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఎమ్మెల్యే దంపతులు డా. కూచుకుళ్ల సరిత రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించగా, ఎమ్మెల్యే దంపతులు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని స్వామి వారిని ప్రార్థించారు. కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కళ్యాణాన్ని కనులారా వీక్షించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి అవసరమైన సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,మండల్ నాయకులు ,ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జర్నలిస్ట్ ల అక్రమ అరెస్ట్ లను ఖండిస్తున్నాం.

## టిఇఎంఎ పాలమూరు కన్వీనర్ అహ్మద్ పాష



**మహబూబ్‌నగర్, జనవరి 14 (నిజాయితి) :** ముగ్గురు ఎన్‌టీవీ జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా పాలమూరు జిల్లా కన్వీనర్ అహ్మద్ పాష తీవ్రంగా ఖండించారు. ఇది రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ మరియు ప్రజాస్వామ్య విలువలపై జరిగిన ప్రత్యక్ష మరియు ప్రమాదకరమైన దాడి గా అభివర్ణించారు. మీడియా కార్యాలయాల్లో పోలీస్ ల సోదాలు, జర్నలిస్ట్ ల పట్ల వ్యవహార శైలిని తీవ్రంగా తప్పు బట్టా రు. అరెస్ట్ చేసిన జర్నలిస్ట్ లను తక్షణమే విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు..

# సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు



**మహబూబ్‌నగర్, జనవరి 14 (నిజాయితి) :** ఈ నెల 17వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయుటకు విచ్చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి పర్యటన నేపథ్యంలో, గౌరవ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న బహిరంగ సభకు, అలాగే మల్లెబోయినిపల్లి సమీపంలో హెలీప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు పర్యవేక్షించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన క్రీడా శాఖా మంత్రి వాకిటి శ్రీహరి



**దేవరకద్ర జనవరి 14 (నిజాయితి) :** దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్రం క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..... నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ...గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే అందరికీ పండగ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక వరి వేస్తే సిరి అని నిరూపించామన్నారు. మన రైతులు పండించిన వడ్లను బియ్యం గా మార్చి ప్రతీ పేదవాడికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

బీద,బడుగు, బలహీన వర్గాల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఉచిత కరెంటు బిల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సర్పంచ్లను గెలిపించిన విధంగానే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరికలు



**మహబూబ్‌నగర్, జనవరి 14 (నిజాయితి) :** మహబూబ్ నగర్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో జాంబ్రా సంఘం నాయకులు చేరారు.

సంఘం సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, సంఘం సభ్యులు రామస్వామి, దోమ వెంకటేష్, స్వామి, అశోక్, శ్రీనివాసులు, బుచ్చన్న, జ్ఞానేశ్వర్, ఆనందకుమార్, రాఘవేంద్ర ప్రసాద్, బాలరాజు తో పాటు పలువురు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికీ పార్టీ క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి శ్రీనివాస్ గౌడ్ ఆహ్వానించారు.

కార్యక్రమం లో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు రామలింగం, సీనియర్ నాయకులు పాల సతీష్, పావనకుమార్, వెధవత్, నరేందర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఐమాక్స్ లైట్స్ ప్రారంభించిన సర్పంచ్



**తెల్కపల్లి, జనవరి 14 (నిజాయితి) :** తెల్కపల్లి మల్లెలమ్మ చౌరస్తాలో బుధవారం సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్ ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రత్యేక నిధులతో ఈ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా తెల్కపల్లి గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని అన్ని కూడలలో అందకారాన్ని దూరం చేసే విధంగా ఈ విధమైన ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఇటీవల ఈదమ్మ గుడి, చంద్రారెడ్డి దుకాణం చౌరస్తా, పోలీస్ స్టేషన్ రోడ్ టర్నింగ్‌లో కూడా ఇలాంటి ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వారణాసి శ్రీనివాసులు, వార్డు సభ్యులు ఎండి. మాక్సూద్ , బాషమోని జ్యోష్నశివ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై ప్రభుత్వం చేసే ముసుగు దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక

**డి. వై. గిరి, అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ జర్నలిస్టు యూనియన్**




**హైదరాబాద్, జనవరి 14 (నిజాయితి) :** ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై ఇటీవల జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్‌టివి కి చెందిన జర్నలిస్టుల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అనుసరిస్తున్న తీరును చూస్తే ఇది చట్టపరమైన చర్యలా కాకుండా జర్నలిస్టులపై చేసిన ముసుగు దాడిలా స్పష్టంగా కనిపిస్తోంది. వార్త నచ్చలేదని, కథనం వివాదాస్పదమైందని, ఐదు రోజుల క్రితం ప్రసారమైన ఒక న్యూస్ ఆధారంగా నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా, కుటుంబంతో విదేశాలకు వెళ్తున్న ఒక జర్నలిస్టును ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకోవడం ఏ ప్రజాస్వామ్యంలో సమంజసం?.... ఇది చట్టం పేరుతో భయపెట్టే ప్రయత్నం కాకపోతే మరేమిటి?...వార్తా ప్రసారాల్లో తప్పులు జరిగితే చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి. వివరణ కోరవచ్చు, నోటీసులు ఇవ్వవచ్చు, కౌన్సిల్‌లు, కమిటీలు ఉన్నాయి. కానీ వాటన్నింటిని పక్కన పెట్టి, అరెస్టుల బెదిరింపులతో జర్నలిస్టులను నోరు మూయించాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే విచారణ అంటూ, అరెస్ట్ చేశామంటూ చెబుతున్నారు. కానీ అరెస్ట్ చూపడం లేదు. ఎక్కడ ఉంచారో చెప్పడం లేదు. నేరుగా మేజిస్ట్రేట్ ముందు హాజరు చేస్తామన్న సంకేతాలు ఇస్తున్నారు. ఇవి అన్నీ కలిసి చూస్తే, ఇది న్యాయ ప్రక్రియలా కాకుండా అధికార దుర్వినియోగానికి ప్రతిరూపంగా కనిపిస్తోంది. ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. ఈరోజు ఒక ఛానల్, ఒక జర్నలిస్టు రేపు ఏ మీడియా గొంతుకైనా ఇదే పరిస్థితి రావచ్చు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతును అణిచివేయడం ద్వారా ప్రభుత్వం బలపడదు. అది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ఇది చట్టబద్ధమైన చర్య కాదు, ఇది రాజకీయ ఒత్తిడితో చేసిన ముసుగు దాడి, ఇది మీడియా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి ప్రభుత్వం వెంటనే ఈ వైఖరిని మార్చుకోవాలి.

జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలి. మానుకోవాలి. లేకపోతే ఈ మౌనం రేపు పెద్ద జర్నలిస్ట్ ప్రతిఘటనగా మారుతుంది.

# రూ. లక్ష కోసం ఆడబిడ్డను విక్రయించిన దంపతులు



**ఫరూక్‌నగర్, జనవరి 14 (నిజాయితి) :** పేదరికమో లేదా ఆడపిల్లనే భారమనుకున్నారో కానీ, కన్న పేగు బంధాన్ని తెంచుకుని ఆ పసికందును విక్రయించిందో జంట. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం లాల్సింగ్ తండాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ శిశు విక్రయ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.

లాల్సింగ్ తండాకు చెందిన వాడ్యావత్ రేణుక గతేడాది నవంబరు 9న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నిబంధనల ప్రకారం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది. అయితే, జనవరి 1 నుంచి రేణుక కేంద్రానికి రాకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్త చింటుకు అనుమానం వచ్చి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు 'ఆపరేషన్ స్మైల్' టీంతో కలిసి విచారణ చేపట్టగా షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి.

ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన గోవింద్ అనే మధ్యవర్తి ద్వారా రేణుక దంపతులు తమ బిడ్డను హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబానికి విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ బేరం సుమారు లక్ష రూపాయలకు కుదిరినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి శిశువును స్వాధీనం చేసుకుని, సురక్షితంగా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమంలో భాగంగా పోలీసులు తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురైన శిశువులను గుర్తిస్తున్నారు. ఈ కేసులో మధ్యవర్తి గోవింద్‌తో పాటు, బిడ్డను కొనుగోలు చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

# పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ




**కోస్గి, జనవరి 14 (నిజాయితి) :** బుధవారం నారాయణ పేట జిల్లా కోస్గి మున్సిపాల్టి పోతిరెడ్డిపల్లి గ్రామం లో పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్ , రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలగోపి , ఇప్పలి సుదర్శన్ విగ్రహ దాత బాలరాజు , ముకుందం నాగేష్ , రిపోర్టర్ ఆంజనేయులు , కూర వెంకటయ్య,పండుగ యాదయ్య మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# చైనా మాంజాతో గొంతు తెగి యువకుడి మృతి



**సంగారెడ్డి, జనవరి 14 (నిజాయితి) :** సంక్రాంతి పండగ రోజు చైనా మాంజా తెగి యువకుడు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫసల్‌వాదీలో చోటుచేసుకుంది. బతుకు దెరువు కోసం సంగారెడ్డి ప్రాంతానికి వచ్చి పనిచేసుకుంటూ జీవిస్తున్న యువకుడు చైనా మాంజా తగిలి గొతు కోసుకుపోయి మృత్యువాత పడటం కుటుంబ సభ్యలతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవదేష్‌కుమార్ (38) ఫసల్‌వాదీలో గ్రాంలో పొలంలో కూలీ పనుల కోసం వచ్చి వరి నాట్లు వేసి కూరగాయల కోసం సంగారెడ్డికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా గాలిపటాలు ఎగురవేసే దారం ఎడకు తగిలి తీవ్ర రక్త స్రావం కాగా స్థానికులు పోలీసులు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయాడని తెలిపారు. మృతుడి కుమారుడు భాను ప్రతాప్ భాస్కర్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని చైనా మాంజాను స్వాధీనం చేసుకొని మృతదేహాన్నీ పోస్టుమార్టం కోసం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంక్రాంతి పండగనాడు చైనా మాంజాతో యువకుడు మృతి చెందిన సంఘటన తీవ్ర విషాదం నెలకొంది.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ.152.40 కోట్ల విడుదల



**హైదరాబాద్, జనవరి 14 (నిజాయితి) :** ప్రతి వారం బిల్లులు చెల్లింపుల ప్రక్రియలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం రూ.152.40 కోట్లను హౌజింగ్ శాఖ విడుదల చేసినట్టు ఎండి విపి గౌతమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చినాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (హౌసింగ్ కార్పొరేషన్) క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణపు పనుల పురోగతిని బట్టి ప్రతి వారం బిల్లులను పూర్తి పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఈ వారంలో 13,861 మందికి బిల్లులను విడుదల చేశామని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 2.50 లక్షల ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయని, వాటిలో సుమారు 1.22 లక్షల ఇళ్ల గోడలు, శ్లాబ్ లు పూర్తయ్యాయని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. మార్చి నెలాఖరు కల్లా ఈ పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటూ, మిగిలిన ఇళ్ల పనులు కూడా మరో మూడు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణను అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ పథకంలో ఇంతవరకు మొత్తం రూ.4,000 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని ఎండి గౌతం వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వవద్దని, ఈ విధంగా ఎవరైనా డిమాండ్ చేసినా, ఇతర సమస్యలున్నా కాల్ సెంటర్ 1800 599 5991కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇంచార్జ్‌లను సన్మానించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**అచ్చంపేట, జనవరి 14 (నిజాయితి) :** గత కొద్ది రోజుల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండనాగుల, లింగాల, చారకొండ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు ఎన్నికల ఇంచార్జ్ లాగా బాధ్యతలు వహించిన వారికి ఇరోజు అచ్చంపేట పట్టణంలోనీ అంబేద్కర్ ప్రజా భవన్ టఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంఊలో ఎమ్మెల్యే వంశీకృష్ణ సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.

# కామారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో 600 కు పైగా వీధి కుక్కలు మృతి..!



**కామారెడ్డి, జనవరి 14 (నిజాయితి) :** కామారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో దాదాపు 600లకు పైగా వీధి కుక్కలు మృతి చెందాయి. విషం పెట్టి ఈ కుక్కలను చంపినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పలు గ్రామాల సర్పంచ్ లు, ఇతరులు మొత్తం 15 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వీధి కుక్కలను చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషంతో కూడిన ఇంజెక్షన్ లు, గులికలు ఇవ్వడంతోనే వీధి కుక్కలు మృతి చెందినట్లు స్పష్టం అవుతోంది. కామారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో దాదాపు 600 లకు పైగా వీధి కుక్కలు మృతి చెందడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలను చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పాల్వంచ మండల కేంద్రంతో పాటు ఫరీద్ పేట్, బండరామేశ్వర్ పల్లి, భవానీపేట, వాడి తదితర గ్రామాల పరిధిలోని దాదాపు 600 లకు పైగా వీధి కుక్కలను చంపేశారు. ఇంజెక్షన్ లు, గులికలు ఇచ్చి వీటిని హతమార్చారు. ఇటీవల ఎన్నికైన సర్పంచ్ లు.. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి ఆధ్వర్యంలోనే ఈ చర్య జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఈ క్రమంలో జంతు హక్కుల కార్యకర్తల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఐదుగురు సర్పంచ్ లపై కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. శునకాలను పాతిపెట్టిన ప్రాంతాలను గుర్తించారు. వాటి కళేబరాలను వెలికితీసి పంచనామా నిర్వహించారు. మరోవైపు ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు వీధి కుక్కల అంశంలో ఇటీవల సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కుక్కల దాడిలో గాయపడినా లేదా మరణించిన వారి కుటుంబాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే పరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు వీధి కుక్కల నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీ చేసింది.

# కాంగ్రెస్ పాలన ఎమర్జెనీ రోజులను గుర్తుచేస్తోంది: కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 13 (నిజాయితి) :** జర్నలిస్టులను అమానవీయ పద్ధతిలో చట్టవిరుద్ధంగా అరెస్టు చేయడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్ తీవ్రంగా ఖండించారు. పండుగ పూట ముగ్గురు జర్నలిస్టులను అరెస్టు చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సి రోజులను గుర్తు చేస్తోందని విమర్శించారు. నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. డిజిపి జర్నలిస్టులను నేరస్థుల్లా చూడటం దురదృష్టకరమని ఆయనన్నారు. అర్ధరాత్రివేళ అరెస్టులు చేయడం సరికాదని, అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేస్తున్నాను. డిజిపి చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని, కాంగ్రెస్ పార్టీ, దాని అసమర్ధ నాయకత్వం చేసే మురికి రాజకీయాల్లో భాగస్వాములు కావద్దని హితువు పలికారు. సిఎం రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరిని కెటిఆర్ ఖండించారు. రాహుల్ గాంధీ మీ మొహబ్బత్ కీ దుకాన్ తెలంగాణశాఖ పౌరుల రాజ్యాంగ హక్కుల్ని ఎలా కాలరాస్తుందో మీరు గమనిస్తున్నారని ఆశిస్తున్నానని కెటిఆర్ రాహుల్ గాంధీ నుద్దేశించి వ్యాఖ్యానించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఇలాంటి అణిచివేత ఇప్పుడు తెలంగాణలో మీ సహచరుడు రేవంత్ రెడ్డి పాలనకు నిదర్శనంగా మారిందని కెటిఆర్ దుయ్యబట్టారు.



# అదుపుతప్పి బ్రిడ్జిపై పడిన బైక్.. ఇద్దరు మృతి

**మానెపల్లఇ, జనవరి 14 (నిజాయితి) :** కుంటల మానెపల్లి, సలుగుపల్లి రహదారిపై నులుకు ఒర్రె వద్ద ఉన్న బ్రిడ్జిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన డోంగ్రె రాజయ్య(58) కుమారుడు డోంగ్రె రాజశేఖర్ (21) కు ఇటీవల కుంటల మానెపల్లికి చెందిన బోర్కుట్ శంకర్ కుమార్తె వరలక్ష్మితో వివాహం కుదిరింది. బుధవారం ఉదయం రాజశేఖర్ తన మామ బోర్కుట్ శంకర్ (48) తో కలిసి చికెన్ కొనుగోలు నిమిత్తం సలుగుపెల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి వస్తుండగా కుంటల మానెపెల్లి గ్రామ శివారులోని నులుకు ఒర్రె బ్రిడ్జి వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో వాహనం నియంత్రణ కోల్పోయి బ్రిడ్జిని ఢీకొని కింద పడిపోయింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న రాజశేఖర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, వెనుక కూర్చున్న శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో శంకర్‌ను అంబులెన్స్ ద్వారా కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సర్తాజ్ పాషా తెలిపారు.



# ఢిల్లీ పొంగల్ వేడుకలలో ప్రధాని మోదీ

**ఢిల్లీ, జనవరి 13 (నిజాయితి) :** ప్రధాని నరేంద్రమోదీ బుధవారం నాడు రాజధానిలో పొంగల్ వేడుకలలో పాల్గొన్నారు. ఇది ప్రపంచం లోని పురాతన నాగరికత మూలాలను గుర్తుచేసే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. కేంద్రమంత్రి ఎల్. మురుగన్ ఇంట్లో జరిగిన పొంగల్ వేడుకలకు మోదీ హాజరు కావడం రానున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దక్షిణాది ప్రజలకు చేరువయ్యే అంశంగా భావిస్తున్నారు. పొంగల్ పండుగ కొత్త పంట చేతికి వచ్చిన రైతులు, అందుకు తోడ్పడిన భూమికి, సూర్యుడికి కృతజ్ఞతలు అర్పిస్తూ చేసుకునే ఉత్సవం అని ప్రధాని మోదీ అన్నారు.ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సామరస్యం సమతుల్యతను కాపాడుకోవల్సిన ప్రాముఖ్యతను పొంగల్ పండుగ నొక్కి చెప్పిందన్నారు మోదీ. ప్రపంచ వ్యాప్తంగా తమిళులు దీనిని ప్రపంచ పండుగ గా ఆవిష్కరించారని ప్రధాని అన్నారు. తమిళ సంస్కృతిని గౌరవించేవారితో కలిసి పొంగల్ పండుగలో పాల్గొనడం తనకు గర్వంగా ఉందని మోదీ అన్నారు. ఈ వేడుకలలో ప్రధాని తో పాటు ఉపరాష్ట్రపతి సి. రాధా కృష్ణన్, కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు వివిధ వర్గాల ప్రముఖులు, ఈ మధ్య విడుదలైన తమిళ చిత్రం పరాశక్తి తారాగణం...





శివకార్తికేయన్, రవి మోహన్, సంగీత దర్శకుడు జివి ప్రకాశ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ముందుగా తమిళం, ఆంగ్లంలో రాసిన ఒక లేఖలో పంగల్ సందేశం ఇచ్చారు. తమ కృషితో మన జీవితాలను సుసంపన్నం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. తమిళ ప్రజలకు పొంగల్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. పండగ రోజు విషాదం..

**తుళ్లూరు, జనవరి 14 (నిజాయితి) :** గుంటూరు జిల్లా తుళ్లూరులో పండగ రోజున రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. తుళ్లూరుకు చెందిన బుద్ధ మార్క్, బురద సాంబయ్యలు నూతన బైపాస్ మీదుగా విజయవాడ వెళ్తుండగా.. అటు వైపు నుంచి వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. రాంగ్ రూట్‌లో వచ్చి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# శబరిమలలో మకరజ్యోతి దర్శనం



శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ పంచగిరులపై మకరవిలక్కుగా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ తరలివచ్చారు. బుధవారం సాయంత్రం జ్యోతి దర్శనం కావడంతో అయ్యప్ప స్వామి నామస్మరణతో శబరిమల మార్మోగి పోయింది. జనవరి 14న మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి.

# భారత్ లో పర్యటించనున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ!

**ఢిల్లీ, జనవరి 14 (నిజాయితి) :** జెలెన్‌స్కీ త్వరలో భారత్ పర్యటనకు రానున్నారన్న ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత స్థాయి చర్చలు జరగనున్నాయని వెల్లడించారు. సంయుక్త కమిషన్ సమావేశాన్ని నిర్వహించేందుకు రెండు దేశాలు సిద్ధమవుతున్నాయన్న ఒలెక్సాండర్. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్‌స్కీ త్వరలో భారత పర్యటనకు రానున్నారని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్ వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జెలెన్‌స్కీ సమావేశమవుతారని, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత స్థాయి చర్చలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. భారత్, ఉక్రెయిన్ సంయుక్త కమిషన్ సమావేశాన్ని నిర్వహించేందుకు రెండు దేశాలు సన్నద్ధమవుతున్నాయని ఆయన తెలిపారు. గుజరాత్‌లో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో పోలిష్‌చుక్ మాట్లాడుతూ.. అధ్యక్షుడు జెలెన్‌స్కీ భారత దేశాన్ని సందర్శించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ సంయుక్త కమిషన్ సమావేశం ప్రభుత్వ స్థాయి వేదికగా ఉండి, సహకారానికి సంబంధించిన నిర్దిష్ట రంగాలపై చర్చలకు అవకాశం కల్పిస్తుందని వివరించారు. ముఖ్యంగా ఔషధాలు, పరిశ్రమలు, ఓడరేవుల అభివృద్ధి, పర్యాటకం వంటి రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గుజరాత్‌లో అందుబాటులో ఉన్న సామర్థ్యాలపై ఉక్రెయిన్ ప్రత్యేక ఆసక్తి చూపుతోందని ఆయన అన్నారు.

ఇదిలా ఉండగా, గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఇదివరకే ప్రకటించారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన సందర్భంగా కూడా యుద్ధాన్ని విరమించాలని ప్రధాని మోదీ ఆయనను కోరిన విషయం విదితమే.

# హోరాహోరీగా కోడి పందేలు భారీగా తరలివచ్చిన జనం



**అమరావతి, జనవరి 14:** రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి.గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు.ఏలూరు జిల్లా కైకరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబల పట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

# భోగి వేడుకల్లో హైలెట్‌గా నిలిచిన భారీ భోగి దండ



**కోనసీమ జిల్లా, జనవరి 14:** హిందువులు జరుపుకునే పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. తెలుగువారు మూడు రోజుల పాటు ఈ పండుగను జరుపుకుంటారు. ముఖ్యంగా మొదటి రోజు నిర్వహించే భోగి ప్రత్యేకమనే చెప్పుకోవాలి. తెల్లవారు జామునే అభ్యంగ స్నానమాచరించి.. ఆవు పేడతో చేసే పిడకలను భోగి మంటల్లో వేస్తారు. చిన్నా పెద్దా అంతా కలిసి భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఆడిపాడుతూ ఉత్సాహంగా గడుపుతారు. ప్రతి ఇంటి ముంగిళ్లలో భోగి మంటలు దర్శనమిస్తాయి. ఇంట్లోని పాత, ఉపయోగంలో లేని వస్తువులను భోగి మంటల్లో వేస్తే శుభం కలుగుతుందని ప్రజలు విశ్వసిస్తారు. ఇదిలా ఉండగా.. భోగి పండుగను పురస్కరించుకుని అంబేద్కర్ కోనసీమలో రూపొందించిన భారీ భోగి దండ అందరినీ ఆకట్టుకుంటోంది. అమలాపురంలోని రంగాపురం గ్రామస్థులు ఈ భోగి మాలతో నేటి సంక్రాంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దాదాపు 20 వేల పిడకలతో 1000 అడుగుల భారీ భోగి దండను తయారు చేశారు గ్రామస్థులు. ఆ ఊళ్లోని విశ్వనాథ రాజు కుటుంబం.. స్థానికులతో కలిసి ఆవు పేడతో 20 రోజుల పాటు శ్రమించి ఈ హారాన్ని తయారు చేసింది. తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేసేందుకు గత ఆరేళ్లుగా భారీ భోగి దండలను గ్రామస్థులు తయారు చేస్తున్నారు. ఆరేళ్ల క్రితం 400 అడుగులతో మొదలైన భోగి దండ తయారీ నేడు 1000 అడుగులకు చేరిందని ఆ ఊరి ప్రజలు వివరించారు. సుమారు అర కిలోమీటర్ మేర ఉన్న ఈ భారీ భోగి మాలను గ్రామస్థులతో కలిసి విశ్వనాథరాజు కుటుంబ సభ్యులు భోగి మంటలో వేశారు. ఈ మాలను మంటలో వేసేందుకు తరలివచ్చిన వారితో ఈ ఊళ్లో సందడి వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఈ భారీ భోగి దండ జిలాల్లో చర్చనీయాంశంగా మారింది.14 వేల పిడకలతో.మరోవైపు..నెల్లూరు జిల్లాలో పెద్దఎత్తున భోగి సంబరాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన భోగి సంబరాల్లో మంత్రి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజలతో కలిసి భోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి నారాయణ అన్నారు. ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో తులతూగాలని మంత్రి ఆకాంక్షించారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివాన్ గేటెడ్ కమ్యూనిటీలో అత్యంత వైభవోపేతంగా భోగి సంబరాలు నిర్వహించారు. అటు ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి.తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజ కవర్గం నారావారిపల్లెలో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వగ్రామం సొంత ఇంటి వద్ద భోగి పండుగ నేపథ్యంలో టెంకాయ, అరటి ఆకులతో ప్రత్యేక తోరణాలతో అలంకరించారుకాకినాడ జిల్లా పిఠాపురం జై గణేశ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 14 వేల ఆవు పిడకలతో భోగిమంట వేశారు. ఆలయం నుంచి మేళ తాళాలు, తప్పెడు గూళ్లు, గంగిరెద్దులు, హరిదాసుల సంకీర్తనలతో కోటగుమ్మం సెంటర్ వద్ద భోగి మంట వేశారు. ఆలయ అర్చకులు మైలవరపు రామకృష్ణ భోగి మంట వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

# ఈ సంక్రాంతి సర్వైశ్వర్యం, సమృద్ధి ప్రసాదించాలి




**అమరావతి, జనవరి 14:** రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి సౌభాగ్యాన్ని అందించాలని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పవన్ ఆకాంక్షించారు. సంక్రాంతి అనగానే మన మదిలో మెదిలేది.. భోగి మంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందేలు, కొత్త దుస్తులు, పిండి వంటలు అని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేనేలేదని డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు.శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతి పండుగ నాడు ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని పవన్ కోరారు. 'మహా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ సంక్రాంతి తెలుగు వారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభమంగళాలను ప్రసాదించాలని ఆ సర్వేశ్వరుడిని వేడుకుంటున్నానని చెబుతూ.. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.భోగి భోగ, భాగ్యాలు అందించాలి: మంత్రి నిమ్మలరాష్ట్ర ప్రజలకు భోగి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు మంత్రి నిమ్మల రామానాయుడు . రాష్ట్ర ప్రజలందరికీ భోగి భోగ, భాగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. మన తెలుగు సంప్రదాయాలను యువత కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో గ్రామీణ ప్రాంతాలు సంక్రాంతి శోభతో విరాజిల్లుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుంచి విముక్తి పొంది నేడు సుఖ సంతోషాలతో ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకుంటున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు(పాలనలో ఇరిగేషన్ రంగం గాడిలో పెట్టడంతో ప్రతి ఎకరానికి సాగు నీరందుతోందని తెలిపారు. ఇబ్బందులు లేని వ్యవసాయాన్ని అన్నదాతలు చేస్తున్నారని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

# పండగ వేళ గుడ్ న్యూస్.. ఖాతాలు చెక్ చేసుకోండి




**అమరావతి, జనవరి14:** సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం (బుధవారం) చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. అలాంటి వేళ ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పందించారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి సంక్రాంతి పండుగను తామందరం చాలా సంతోషంగా జరుపుకుంటామని చెప్పారు.గతంలో సీఎం చంద్రబాబును కలిసి సరెండర్ లీవులకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పోలీసులు అందరి తరఫున కృతజ్ఞతలతోపాటు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు. అలాగే ఈ నిధులు విడుదలకు సహకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోమ్ మంత్రి అనితతోపాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి ఈ సందర్భంగా శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు.సంక్రాంతి పండగవేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించింది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు.డీఏ, డీఆర్ఏ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్ఏ బకాయిలు జమ కావడంతో ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో ఈ నిధులను ఆర్థిక శాఖ జమ చేస్తోంది. ప్రభుత్వానికి, సీఎంకు ఉద్యోగ సంఘాలు సైతం కృతజ్ఞతలు తెలియజేశాయి.

# కూటమి పాలనలో పేదల చేతుల్లో డబ్బులు లేక సంక్రాంతి వెలవెల




**అమరావతి :** వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సెల్వమణి ఏపీ ప్రజలకు భోగి , సంక్రాంతి ఊ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ' పాతదాన్ని దహనం చేసి కొత్తదాన్ని ఆహ్వానించే భోగి పండుగ, మన జీవితాల్లోని చెడును, బాధలను కూడా దహనం చేసి కొత్త వెలుగులు, కొత్త ఆశలు, కొత్త ప్రారంభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.నగరి నియోజకవర్గంలోని తన నివాసంలో బుధవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగను హయంలో పేదలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అన్నింటిని నిలిపివేశారని ఆరోపించారు. పేదల చేతుల్లో డబ్బులు లేక ఏ పండుగను ఆనందంగా జరుపుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.కొత్త సంవత్సరంలో మొదటి పండుగ సంక్రాంతికి రైతన్నలకు పంట చేతికొచ్చి చేతినిండా డబ్బులు ఉండే పండుగ అని అన్నారు. అందుకు భిన్నంగా రైతన్నలకు రబీకి ఆర్థిక సహాయం అందక పోవడం ప్రభుత్వం ఇస్తామన్న రూ. 40 వేలలో కేవలం రూ.10 వేలు మాత్రమే అందించడం , వర్షాలతో నష్టపోయిన రైతన్నలకు పరిహారం అందకపోవడంతో పండుగను సంతోషంగా జరుపుకోవడం లేదని ఆరోపించారు.వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో రైతులు ఎంతో సంతోషంగాఉండేవారని పేర్కొన్నారు. వైద్యరంగాన్ని ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ జీవోలను రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు భోగి మంటల్లో దగ్ధం చేశారని వెల్లడించారు. నగరి నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారని, వీరికి ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, పవర్‌లూమ్‌లకు కరెంట్ చార్జీలను తగ్గించాలని రోజా డిమాండ్ చేశారు.

# పవన్ కళ్యాణ్ వల్లే ఆ పేరు వచ్చింది.. అంబటి రాంబాబు డ్యాన్స్ చూశారా.!



**గుంటూరు జనవరి 14:** సంక్రాంతి అంటే.. గుంటూరులో మామూలుగా ఉండదు. ఎందుకంటే అక్కడుంది అంబటి రాంబాబు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భోగి పండుగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే కాముడి దహనం చేశారు. ఈ వేడుకలకు పట్టణంలోని పలుప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. ముఖ్యంగా రాంబాబు డ్యాన్స్ కోసం అంతా ఎదురుచూశారు. అక్కడకు వచ్చిన మాజీ ఎంపీ మోదుగులతో కలిసి అంబటి కాసేపు స్టెప్పులేశారు. అయితే తన డ్యాన్సు అప్పుడే కాదు.. ఇకముందు చూపిస్తా అని అప్పుడే చెప్పారు అంబటి. అన్నట్లుగానే ఫుల్లుగా ప్రిపేర్ అయ్యి వచ్చి.. ఓ మంచి కొరియోగ్రాఫ్ చేసి చూపించారు. లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ అంబటి సంబరాలు చేసుకున్నారుసంక్రాంతి అంటే నేనే అంటున్నారు అంబటి రాంబాబు. ఈ సంప్రదాయం ఇప్పటిది కాదు.. చాలా రోజుల నుంచి కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక అంబటి రాంబాబు డ్యాన్సులు ఇంకా ఫేమస్ అయ్యాయి. అప్పటి నుంచి తన స్టెప్పులతో అందర్నీ ఆకట్టుకుంటూ వస్తున్నారు అంటి. ఈ మూడు బాక్సుల్లో చూడొచ్చు అంబటి స్టెప్పులు. అప్పుడు సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉండేవారు.. ఇప్పుడు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. భోగి మంటల్లో ఈ ప్రభుత్వం ఇచ్చిన జీవోలను దహనం చేశామన్నారు మాజీ మంత్రి అంబటి. ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి ఇచ్చిన జీవోలను కాల్చేశామన్నారు. అయితే తనకు సంబరాల రాంబాబు అనే పేరు రావడానికి కారణం పవన్ కల్యాణే అన్నారు.

# జగన్‌కు సద్బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరుకున్నా



**అమరావతి, జనవరి 14:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై మంత్రి సవిత వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జగన్‌కు సద్బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరుతున్నానని ఆమె అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్టాలు ఎక్కుతున్న వేగాన్ని తట్టుకోలేక జగన్ విష ప్రచారానికి దిగజారుతున్నారని విమర్శించారు.మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను జగన్ అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయని, కేవలం భారతదేశం మాత్రమే కాకుండా విదేశాల నుండి కూడా పెట్టుబడులు రాష్ట్రంలోకి వచ్చి చేరుతున్నాయని చెప్పారు.అక్రమ కేసుల్లో చిక్కుకున్న చంద్రబాబు "కడిగిన ముత్యంలా" బయటకు రావడం రాష్ట్ర ప్రజలకు సంతోషాన్ని ఇచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. అప్పటి చంద్రబాబు అరెస్ట్‌ను ప్రపంచం ఖండించిందని, ఆయనపై ప్రజలకు నమ్మకం పుష్కలంగా ఉందని తెలిపారు.సవిత మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సమయంలో చంద్రబాబుకు అనుకూలంగా వచ్చిన తీర్పు ప్రతి ఒక్కరికి ఆనందాన్ని నింపిందని అన్నారు. అయితే, జగన్‌కు సవాల్ విసురుతూ, దమ్ముంటే కనీసం ఒక కేసులో అయినా నిర్దోషిగా బయటపడాలని ఆమె ప్రశ్నించారు. చివరగా, పండుగ సమయంలో జగన్ పేరు కూడా ప్రస్తావించడం మంచిది కాదని వ్యాఖ్యానిస్తూ తన మాటలను ముగించారు.

# తేజ్ మకరసంక్రాతి విందుకు లాలూ మళ్లీ దగ్గరవుతున్న సంకేతాలు



**పాట్నా:** ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో తలెత్తిన విభేదాలు క్రమంగా చక్కబడుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. బిహార్ ఎన్నికలకు ముందు పార్టీ నుంచి, ఫ్యామిలీ నుంచి లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యాడు. ఈ క్రమంలో మకర సంక్రాంతి సందర్భంగా తేజ్ ప్రతాప్ బుధవారంనాడు ఏర్పాటు చేసిన 'దహీ-చురా' విందులో లాలూ పాల్గొన్నారు. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సైతం ఈ విందుకు హాజరయ్యారు.దీనికి ఒకరోజు ముందు మంగళవారంనాడు పాట్నాలోని తన తల్లి రబ్రీదేవి నివాసానికి తేజ్ ప్రతాప్ వెళ్లారు. లాలూ, రబ్రీ, తమ్ముడు తేజస్వి యాదవ్‌తో ఆయన భేటీ అయ్యారు. 'దహీ-చురా' విందుకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో కొద్దికాలంగా ఇంటిపట్టునే లాలూ ఉంటున్నారు. అయితే తేజ్ ఆహ్వానం మేరకు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి విందులో పాల్గొన్నారు. దీనిపై మీడియా ప్రశ్నలకు లాలూ స్పందించలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర ఓటమి నేపథ్యంలో తేజ్‌తో తిరిగి కుటుంబ సంబంధాలు నెరపాలని లాలూ ఆలోచన కావచ్చనే ప్రచారం జరుగుతోంది.తేజ్ ప్రతాప్‌పై గత ఏడాది మేలో ఆర్జేడీ బహిష్కరణ వేటు వేసింది. 12 ఏళ్లుగా తాను ఓ అమ్మాయితో రిలేషన్‌లో ఉన్నట్టు ఫే?స్‌బుక్ పోస్టులో తేజ్ ప్రకటించడంతో లాలూ కుటుంబంలో చిచ్చు రేగింది. తేజ్‌ను ఆర్జేడీ నుంచి, కుటుంబం నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్టు లాలూ ప్రకటించారు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో తేజ్ సొంతంగా జేజేడీ పార్టీని ఏర్పాటు చేసి పలువురు అభ్యర్థులను బరిలోకి దిగారు. అయితే ఆ పార్టీ అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారు.డిప్యూటీ సీఎం విందుకు తేజ్‌కాగా, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా మంగళవారంనాడు ఇచ్చిన మకర సంక్రాంతి విందుకు తేజ్ హాజరుకావడం కూడా పలు ఊహాగానాలకు తావిచ్చింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో తేజ్ చేరవచ్చనే ప్రచారం జరిగింది. ఇటు జేడీయూ సీనియర్ నేత రత్నేశ్ సదా సైతం మకర సంక్రాంతి విందు ఇచ్చారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆయన మంత్రివర్గ సహచరులు పలువురు ఈ విందులో పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో ఘోరం 600 వీధికుక్కల మృతి పోలీసులకు ఫిర్యాదు!



**కామారెడ్డి జిల్లా:** కామారెడ్డి జిల్లాలో మానవత్వం మంటగలిసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాల్లో సుమారు 600కు పైగా వీధి కుక్కలను దారుణంగా చంపేశారు. పాల్వంచ, ఫరీద్‌పేట్, బండరామేశ్వర్‌పల్లి, భవానీపేట, వాడి గ్రామాల్లో ఈ దారుణం జరిగింది. కుక్కల బెడద ఎక్కువగా ఉందనే నెపంతో ఇలా సామూహికంగా వాటిని అంతం చేయడం ఇప్పుడు స్థానికంగా పెద్ద కలకలం రేపుతోంది. ఈ దారుణానికి సంబంధించి గ్రామాల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌ల పైనే ఆరోపణలు వస్తున్నాయి. వారి ఆధ్వర్యంలోనే కుక్కలకు విషం పెట్టి చంపించారని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల సమస్య ఉంటే వాటికి సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేయించాలి కానీ, ఇలా ప్రాణాలు తీయడం చట్టవిరుద్ధమని వారు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న జంతు హక్కుల కార్యకర్తలు వెంటనే స్పందించారు. మూల రజని, అనిత, భాను ప్రకాష్, గోవర్ధన్ బృందం మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. కుక్కలను ఎక్కడెక్కడ పాతిపెట్టారో ఆ ప్రాంతాలను గుర్తించి పరిశీలించారు. మూగజీవులను పొట్టనబెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు మరియు జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్ అల్వాల్‌లో కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం



అల్వాల్ ప్రాంతంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక ట్రూవేల్యూ సెకండ్ హ్యాండ్ కార్ల షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు షోరూం అంతటా వ్యాపించడంతో చుట్టుపక్కల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆకాశంలోకి దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షోరూంలో కార్లు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది క్షేమంగా బయటపడ్డారా లేదా అనే సమాచారం ఇంకా పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ మంటలు అంటుకున్నాయా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ప్రమాదం కారణంగా షోరూం చుట్టుపక్కల భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆస్తి నష్టం భారీగానే ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# గొంతుకోసిన చైనా మాంజా వాహనదారుడు మృతి



**సంగారెడ్డి జిల్లా, జనవరి 14:** సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ రాష్ట్రానికి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే, ఇవాళ(బుధవారం) బైక్‌పై వెళుతుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. అయితే, ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ.1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారం




**హైదరాబాద్ :** సాగు భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జనగామ కేంద్రంగా జరిగిన ఛార్జీల దారి మళ్లింపు వ్యవహారంలో అక్రమార్కులు 'బర్ప్ సూట్' అనే ఆధునిక సాఫ్ట్‌వేర్ వాడినట్లు వెలుగులోకి వచ్చింది. చలానాల చెల్లింపు ప్రక్రియలోకి చొరబడ్డ నిందితులు, ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి అక్రమాలకు పాల్పడి ఉంటారని, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చాలాకాలంగా ఇది జరుగుతోందని అధికారులు అనుమానిస్తున్నారు. జనగామలోని ప్రైవేటు ఆన్‌లైన్ కేంద్రం ద్వారా జరిగిన ఒక లావాదేవీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఖాజానాకు రూ.52 కోట్ల నష్టం : ఈ ఉదంతం బయటకు రావడంతో రెవెన్యూ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో మొత్తం 4,800 లావాదేవీల ద్వారా ప్రభుత్వ ఖాజానాకు రూ.52 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తేలింది. రంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఇలాంటి లావాదేవీలు అత్యధికంగా జరిగినట్లు గుర్తించారు. ఈ అక్రమాలపై విచారణకు ప్రభుత్వం రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్? తదితర విభాగాలకు చెందిన అధికారులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే స్లాట్లు బుక్ చేసిన ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. పోర్టల్‌లోని లోపాలను అడ్డం పెట్టుకొని నిందితులు అక్రమాలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

# భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల వ్యవహారం బస్వరాజ్‌ భారీ స్కామ్ లగ్జరీ కార్లు థయ్‌లాండ్ టూర్లు




**హైదరాబాద్ :** ధరణి పోర్టల్ సాక్షిగా సాగు భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల మళ్లింపు వ్యవహారంలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ భారీ కుంభకోణానికి ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న యాదగిరిగుట్టకు చెందిన బస్వరాజ్ అనే వ్యక్తి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి రూ. కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో తేలింది. జనగామ కేంద్రంగా బయటపడిన ఈ 'డిజిటల్ దోపిడీ' వెనుక ఆధునిక హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్ బర్ప్ సూట్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు బస్వరాజ్.. కేవలం రిజిస్ట్రేషన్ ఛార్జీల మళ్లింపు ద్వారానే ఏకంగా రూ. 11 కోట్లు వెనకేసినట్లు సమాచారం. ఈ అక్రమ సంపాదనతో అతను అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపాడు. ఖరీదైన ఫార్చ్యూనర్ కార్లు కొనడమే కాకుండా, పదేపదే థయ్‌లాండ్ వంటి విదేశీ పర్యటనలు చేస్తూ ఎంజాయ్ చేసేవాడని పోలీసులు గుర్తించారు. ఇతనికి పాండు అనే మరో వ్యక్తి సహకరించినట్లు తెలుస్తోంది. బస్వరాజ్ వద్ద 1,200కు పైగా రిజిస్ట్రేషన్ పత్రాలు లభించడం ఈ దోపిడీ తీవ్రతను అద్దం పడుతోంది. ఈ కుంభకోణంలో 'బర్ప్ సూట్' సాఫ్ట్‌వేర్‌ను నిందితులు అద్భుతంగా వాడుకున్నారు. సాధారణంగా రైతులు రిజిస్ట్రేషన్ ఛార్జీలను నగదు రూపంలో ఆన్‌లైన్ సేవా కేంద్రాల్లో చెల్లిస్తారు. ఉదాహరణకు ఒక రైతు రూ. 15,000 ఛార్జీ ఇస్తే.. నిర్వాహకులు అందులో కేవలం రూ. 150 మాత్రమే బ్యాంకుకు చెల్లించేవారు. అయితే బర్ప్ సూట్ సాఫ్ట్‌వేర్ ద్వారా బ్యాంకింగ్ డేటాను ఇంటర్సెప్ట్ చేసి ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం రూ. 15 వేలు జమ అయినట్లు తప్పుడు రశీదులు సృష్టించేవారు. ఇలా ఒక్కో లావాదేవీలో వేల రూపాయలు దోచుకుంటూ ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,800 లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు, దీనివల్ల ప్రభుత్వానికి రూ. 52 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తేలింది. ముఖ్యంగా జనగామ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ అక్రమాలు తారస్థాయిలో జరిగాయి. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినా బయటకు రాకుండా ఉండేందుకు నిందితులు వారికి భారీగా 'మామూళ్లు' ముట్టజెప్పినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈ భారీ స్కామ్‌పై ప్రభుత్వం ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, రిజిస్ట్రేషన్ విభాగాలతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బస్వరాజ్ లాంటి నిందితులు పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఎలా వాడుకున్నారనే కోణంలో విచారణ ముమ్మరంగా సాగుతోంది.

# రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలేమో




**హైదరాబాద్:** జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమీషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమీషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమీషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# కాళేశ్వరం ఆనకట్టల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి - వచ్చే నెల నుంచి పనులు!



**కాళేశ్వరం:** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి పెట్టింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే మరమ్మతులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరమ్మతులకు డిజైన్లు అందించేందుకు బాంబే ఐఐటీ భాగస్వామ్యంతో ముందుకొచ్చిన ఆర్వీ ఇండియాను ఎంపిక చేసినట్లు నీటి పారుదల అధికారులు సీఎంకు చెప్పారు. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆనకట్టలతో పాటు ప్రాజెక్టులపై సీఎం సమీక్ష : రాష్ట్రంలోని ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు, ఇంజినీర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. శుక్రవారం ప్రారంభించనున్న చనకా-కొరాటా, సదర్మాట్ ఆనకట్టలతో పాటు చిన్న కాళేశ్వరం, దేవాదుల సహా గోదావరి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టు, ఇంకా చేయాల్సిన భూసేకరణ, అందుకోసం అవసరమయ్యే వ్యయం తదితర అంశాల గురించి ఆరా తీశారు. ఆనకట్టల మరమ్మతుల ప్రక్రియలపై సీఎం ఆరా : వీలైనంత త్వరగా భూసేకరణ సహా పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన నిధులను విడుదల చేస్తామని పేర్కొన్నారు. భూసేకరణ కోసం నిధుల ఇబ్బంది ఉండబోదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ఆనకట్టల మరమ్మతుల ప్రక్రియ పురోగతిపైనా సీఎం ఆరా తీశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతుల కోసం డిజైన్ కన్సల్టెన్సీని ఖరారు చేసినట్లు అధికారులు వివరించారు. బాంబే ఐఐటీ భాగస్వామ్యంతో వచ్చిన ఆర్వీ ఇండియాను ఎంపిక చేసినట్లు చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టులరై సీఎం రేవంత్?రెడ్డి సమీక్ష - మరో నెలలో బ్యారేజీల మరమ్మతులు ప్రారంభమయ్యే అవకాశం పూర్తి స్పష్టత తర్వాతే ప్రక్రియ ప్రారంభం : ఇప్పటికే సీడబ్ల్యూపీఆర్?ఎస్? ఆధ్వర్యంలో మూడు ఆనకట్టల వద్ద పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు. అన్నారం, సుందిళ్లలో ఫిబ్రవరి నుంచి అన్ని పనులు సమాంతరంగా చేపట్టాలని భావిస్తున్నట్లు వివరించారు. మేడిగడ్డ విషయంలో పూర్తి అవగాహన, స్పష్టత వచ్చిన తర్వాతే మరమ్మతుల ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తున్నారు. కన్సల్టెన్సీ ఇచ్చిన డిజైన్లను కేంద్ర జల సంఘం పరిశీలించి ఆమోదించిన తర్వాతే మరమ్మతుల విషయంలో ముందుకెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. పోలవరం-నల్లమలసాగర్‌కు సంబంధించి సుప్రీంకోర్టు విచారణలో వచ్చిన అంశాలు, తదుపరి కార్యాచరణ సహా ఇతర అంశాలపై ముఖ్యమంత్రి చర్చించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేత దృష్టి : కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. సుమారు రూ.లక్ష కోట్లు వ్యయం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ముందుకెళ్లే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. కుంగిన మేడిగడ్డ సీపేజీ, ఇసుకమేట సమస్య ఎదుర్కొంటున్న ఇతర బ్యారేజీల విషయంపై దృష్టి సారించింది. ఎన్?డీఎస్?ఏ సిఫార్సుల అమలు, జస్టిస్? పీసీ ఘోష్? కమిషన్?, విజిలెన్స్? నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటూనే, ఇతర పనులను చేయాలని నిర్ణయించింది. ఇందులో ప్రత్యేకించి ఎల్లంపల్లి నుంచి దిగువన అన్ని రకాల పనులను పూర్తి చేసి, ఆ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడానికి ఏం చర్యలు తీసుకోవాలన్న అంశంపై ప్రణాళికలు చేస్తుంది.

# మేడారంలో కొనసాగుతున్న ముందస్తు మొక్కులు



**తాడ్వాయి(ములుగు):** మేడారంలో వనదే వతలు సమ్మక్క-సారలమ్మలను భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. తల్లుల గద్దెలకు పూజలు చేసి కోరికలు తీరాలని వేడుకున్నారు. ప్రకృతి దేవతలుగా కొలువైన అమ్మ వార్లను దర్శించుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, ఎత్తు బంగారం(బెల్లం), కొబ్బరికాయలు, యాట మొక్కులు సమర్పించుకున్నారు. 30వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికా రులు తెలిపారు. భక్తుల రాకతో గద్దెల పరిసరాలు, దేవస్థా నం ప్రాంగణం రద్దీగా మారాయి. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలతో డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, సమ్మక్క- సారలమ్మల నామస్మరణల తో మేడారం పరిసరాలు, దేవస్థానం మార్మోగింది. వనదేవ తలను దర్శించుకున్న భక్తులు పరిసరాల్లో విడిది చేసి బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. రోడ్లపై దుబ్బ తొలగింపు

తాడ్వాయి: మహాజాతర సందర్భం గా జరుగుతున్న అభివృద్ధి పనులతో రోడ్డు మట్టి, దుబ్బతో నిండిపోయాయి. దీంతో పారిశు ధ్య కార్మికుల ద్వారా అధికారులు రోడ్లపై ఉన్న దుబ్బను తొలగించారు. అంతేకాకుండా రోడ్లు శుభ్రం చేసే ప్రత్యేక యంత్రాలతో రాత్రి సమయాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని డీపీవో వెంకయ్య తెలిపారు. అదనపు కార్మికులతో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తున్నామని అన్నారు. దేవస్థానంలో పూజిత వృక్షాలుతాడ్వాయి: మేడారం దేవస్థానంలో వ నదేవతల దేవతా వృక్షాలు, పూజి త వృక్షాలను భక్తులకు తెలిసేలా అధికారులు నాటుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సమ్మ క్క- సారలమ్మల గద్దెల దేవస్థా నం పరిసరాల్లో అధికారులు వృ క్షాలను నాటారు. దేవస్థానం ఆ ధునికీకరణ పనుల్లో భాగంగా చే పట్టిన అభివృద్ధి పనుల్లో ఈ వృక్షా లను అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ మరుగుదొడ్లు. తాడ్వాయి: మేడారానికి మందస్తుగా తరలివస్తున్న మహిళా భక్తుల కోసం అధికారులు మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, దేవస్థానం పరిసరాలు, జంపన్నవాగు, చిలకలగుట్ట, దేవస్థానం సమీపంలోని పార్కింగ్ వద్ద వీటిని అందుబాటులోకి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సౌకర్యాల నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో ఈ మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. చిలకల గుట్టకు దారి. తాడ్వాయి: మహాజాతర సందర్భం గా సమ్మక్క గద్దెకు వచ్చే చిలకలగద్దె దారిని అధికారులు కార్మికులతో మంగళవారం శుభ్రం చేశారు. ఈ నెల 29న సమ్మక్క దేవత ప్రభుత్వ లాంఛనాలతో గద్దెకు చేరుకోవడం తెలిసిందే. అయితే రెండు సంవత్సరాలుగా గేటు మూసి ఉండటంతో గుట్టకు వెళ్లేదారిలో పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నాయి. మహాజాతర ఏర్పాట్లలో భాగంగా అధికారులు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు

# సెంచరీతో రాణించిన కేఎల్ రాహుల్




రాజ్?కోట్ వేదికగా న్యూజిలాండ్?తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ ఇన్నింగ్స్? ముగిసింది. తొలి ఇన్నింగ్స్?లో బ్యాటింగ్? చేసిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (112లి) సూపర్ సెంచరీ?తో ఆకట్టుకున్నాడు. శుభ్?మన్ గిల్ (56 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించాడు. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లర్క్ 3, కైల్ జెమీసన్, జాక్రీ, లెనెక్స్?, మిచెల్ బ్రేస్?వెల్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.రాణించిన ఓపెనర్లుటాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన భారత్? తొలుత పరుగులు చేసేందుకు బాగా కష్టపడింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (24 పరుగులు), గిల్ నెమ్మదిగా ఆడారు. తొలి ఐదు ఓవర్లకు స్కోర్ 10 పరుగులే. ఆ తర్వాత ఈ ఇద్దరూ జోరు పెంచారు. బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో 10 ఓవర్లకు టీమ్ఇండియా స్కోర్ 57-0కు చేరింది. ఇక ఓపెనర్లు గాడిలో పడ్డారనుకునేలోపు రోహిత్?ను క్లార్క్ పెవిలియన్ చేర్చి షాకిచ్చాడు. 12.2 ఓవర్ వద్ద 70 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత కోహ్లీతో గిల్ ఇన్నింగ్స్?ను నడిపించాడు. హాఫ్ సెంచరీ అనంతరం జేమిసన్ బౌలింగ్?లో గిల్ ఔటయ్యాడు. దీంతో 99కే ఓపెనర్లు పెవిలియన్ చేరారు. ఇక వరుసగా శ్రేయస్ అయ్యర్ (8), విరాట్ కోహ్లీ (23)ని క్లార్క్? ఔట్ చేసి తీవ్రంగా దెబ్బకొట్టాడు. ఈ దశలో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా (27) ఆచితూచి ఆడారు.ఇన్నింగ్స్ సాఫీగా సాగుతుందనుకునేలోపు జడ్డూను బ్రేస్?వెల్ పెవిలియన్?కు పంపాడు. ఆ తర్వాత నితీశ్ కుమార్ (20) కూడా వేగంగా ఆడే క్రమంలో ఔట్ అయ్యాడు. కానీ, మరోవైపు రాహుల్ మాత్రం నిలకడగా ఆడుతూ స్కోర్?ను పెంచాడు. ఈ క్రమంలోనే వన్డే కెరీర్?లో ఎనిమిదో సెంచరీ అందుకున్నాడు.

# కేవలం రోజుకు రూ.200తోనే రూ.10 లక్షలు సృష్టించవచ్చు



మీరు రోజువారీ చిన్న చిన్న పొదుపులు చేయడం ద్వారా గణనీయమైన మూలధనాన్ని కూడబెట్టు కోవాలని ప్లాన్ చేస్తుంటే, సురక్షితమైన పెట్టుబడిని నిర్ధారించడమే కాకుండా అద్భుతమైన రాబడిని అందించే పొదుపు పథకం కోసం చూస్తున్నట్లయితే, పోస్ట్ ఆఫీస్ నిర్వహించే ప్రభుత్వ పథకాలు మీకు ఉపయోగకరంగా ఉంటాయి. ఇండియన్ పోస్ట్ పిల్లలు, వృద్ధులు, మహిళల కోసం చిన్న పొదుపు పథకాలను నిర్వహి స్తుంది. ఈ పథకాలలో ఒకటి పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం. దీనిలో మీరు రోజుకు కేవలం 200 రూపాయలు ఆదా చేయడం ద్వారా రూ. 10 లక్షలకు పైగా సంపాదించవచ్చు.ప్రభుత్వం:పోస్ట్ ఆఫీస్ ఆర్డీ పథకం కింద 6.7% బలమైన వడ్డీ రేటును అందిస్తుంది. కేవలం రూ.100 తో ఖాతాను తెరవవచ్చు. పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలలో పెట్టుబడుల భద్రతకు ప్రభుత్వమే హామీ ఇస్తుందని, ఈ పథకాలలో పెట్టుబడులను పూర్తిగా రిస్క్-రహితంగా చేస్తుందని గమనించాలి.పోస్ట్ ఆఫీస్ ఆర్డీ పథకానికి ఐదు సంవత్సరాల మెచ్యూరిటీవ్యవధి ఉంటుంది. దీనిని మరో ఐదు సంవత్సరాలు పొడిగించవచ్చు. ఇది ఇంకా ఎక్కువ ప్రయోజనాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. ఈ పథకంలో గణనీయమైన మూలధనాన్ని కూడబెట్టుకోవడానికి చిన్న పొదుపులు చేయవచ్చు. 18 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఎవరైనా వారి సమీప పోస్టాఫీసులో ్రూా =ఐ పథకం కింద ఖాతాను తెరవవచ్చు.మీరు మీ పెట్టుబడిపై రుణం కూడా తీసుకోవచ్చు:

పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం కింద ఖాతా తెరవడంతో పాటు, పెట్టుబడిదారులు రుణం కూడా పొందుతారు. దీని వలన =ఐ పథకం మరింత ప్రత్యేకమైన, ప్రజాదరణ పొందిన పోస్ట్ ఆఫీస్ పథకంగా మారుతుంది. పెట్టుబడిదారులు తమ పెట్టుబడిపై రుణం తీసుకోవాలనుకుంటే కొన్ని నియమాలు ఏర్పాటు చేశారు. ఈ నియమాల ప్రకారం, ఖాతా ఒక సంవత్సరం పాటు అమలులో ఉన్న తర్వాత డిపాజిట్ మొత్తంలో 50% వరకు రుణం పొందవచ్చు. 2% వడ్డీ రేటు మాత్రమే వర్తిస్తుంది.రికరింగ్ డిపాజిట్ పథకంలో పెట్టుబడి పెట్టడం వల్ల కలిగే ఇతర ప్రయోజనాలతో పాటు, ఈ ప్రభుత్వ పథకం పెట్టుబడిని మెచ్యూరిటీ వ్యవధికి మించి పొడిగించడానికి అనుమతించడమే కాకుండా, అకాల ముగింపు ప్రయోజనాన్ని కూడా అందిస్తుంది. పెట్టుబడిదారులు కోరుకుంటే మూడు సంవత్సరాల తర్వాత ఈ ఎంపికను ఉపయోగించుకోవచ్చు. ఖాతాదారుడు మరణిస్తే, నామినీ ఆదాయాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. వారు కోరుకుంటే పెట్టుబడిని కొనసాగించవచ్చు.

# టాప్‌లోకి దూసుకెళ్లిన విరాట్ కోహ్లీ నాలుగేళ్ల తర్వాత తొలిసారి నెం 1 బ్యాటర్‌గా




: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్? ప్లేస్?కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్?తో నెం.1 ర్యాంక్?లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్?లో నెం.1 పొజిషన్?కు చేరుకోవడం విరాట్?కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్? సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్?తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్?లో విరాట్?కు, డారిల్ మిచెల్?కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం.ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్?కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్?లో ఉన్నాడు. అయితే రీసెంట్?గా న్యూజిలాండ్?తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్?ల్లో 50ం స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్? రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.టాప్ -5 బ్యాటర్లు

విరాట్ కోహ్లీ (భారత్) - 785 రేటింగ్స్డారిల్ మిచెల (న్యూజిలాండ్)- 784 రేటింగ్స్రోహిత్ శర్మ (భారత్)- 775 రేటింగ్స్ఇబ్రహీమ్ జర్దాన్ (అఫ్గానిస్థాన్)- 764 రేటింగ్స్శుభ్?మన్ గిల్ (భారత్)- 725 రేటింగ్స్విరాట్ ఏ5గతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్?లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్?ల సిరీస్?లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్?లో మూడో మ్యాచ్?లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీస్?తో జరుగుతున్న సిరీస్?లోనూ తొలి

# భారత్‌ను హైయెస్ట్ రిస్క్ కేటగిరిలో పెట్టిన ఆస్ట్రేలియా




భారత్‌ను అత్యంత ప్రమాదకర కేటగిరిలో పెట్టింది ఆస్ట్రేలియా. వినేందుకు కాస్త ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది నిజం. ఆస్ట్రేలియాలో విద్యార్థులకు వీసాలు మంజూరు చేసే అంచనా ఫ్రేమ్‌వర్క్ ూూ1 (అత్యల్ప ప్రమాదం) నుండి ూూ3 (అత్యధిక ప్రమాదం) వరకు ఉంటుంది. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో భారత్‌ను ూూ3 కేటగిరిలో పెట్టింది కంగారు కంట్రీ. భారత్ నుంచి సాధారణంగా వేల మంది విద్యార్థులు ఆస్ట్రేలియాకి వెళ్లి చదువుతున్నారు. ఈ క్రమంలో ఈ ూూ3 కేటగిరి ఎలాంటి ప్రభావం చూపుతుందో అని విద్యార్థులు ఆందోలన చెందుతున్నారు. ఈ మార్పుతో విద్యార్థులకు సంబంధించిన ప్రతీ అంశం మరింత క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.ఈ మార్పులు జనవరి 8 నుండి అమల్లోకి వచ్చాయి. ఈ మార్పు సమస్యల ప్రభావవంతమైన నిర్వహణకు సహాయపడుతుంది, అదే సమయంలో ఆస్ట్రేలియాలో నాణ్యమైన విద్యను కోరుకునే నిజమైన విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూనే ఉంటుంది అని ఆస్ట్రేలియా తెలిపింది. భారత్‌తో పాటు నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్ వంటి అనేక ఇతర దక్షిణాసియా దేశాలు కూడా ూూ3 కేటగిరీలో చేర్చింది ఆసీస్. పాకిస్తాన్ ఈ అత్యధిక ప్రమాద శ్రేణిలోనే ఉంది.డాక్యుమెంటేషన్‌నివేదిక ప్రకారం.. విద్యార్థులు ఇప్పుడు ఫైనాన్షియల్ స్టేటస్, ఆంగ్ల ప్రావీణ్యం, నిజమైన తాత్కాలిక ప్రవేశ ఉద్దేశ్యాలు, ఇతర ప్రమాణాలకు సంబంధించిన విస్తృతమైన రుజువులను అందించాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా ఇమ్మిగ్రేషన్ శాఖ మాజీ డిప్యూటీ సెక్రటరీ అబుల్ రిజ్వి మాట్లాడుతూ.. అధిక రిస్క్ స్థాయిలకు మరిన్ని డాక్యుమెంటేషన్ అవసరమని, అధికారులు డాక్యుమెంటేషన్‌ను పరిశీలిస్తారని అన్నారు. వారు ట్రాన్స్‌క్రిప్ట్‌లను తనిఖీ చేయడానికి సంస్థలకు ఫోన్ చేస్తారు. ఫైనాన్షియల్ స్టేటస్ కోసం బ్యాంకును సంప్రదించవచ్చు అని ఆయన అన్నారు. భారతదేశంలో ఇటీవల జరిగిన భారీ నకిలీ డిగ్రీల వ్యవహారం ఈ మార్పుకు కారణం కావచ్చని ఆయన అన్నారు.కేరళ నకిలీ డిగ్రీ రాకెట్అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు 10 లక్షలకు పైగా వ్యక్తుల మోసపూరిత పత్రాలను సరఫరా చేసిన నకిలీ సర్టిఫికేట్ రాకెట్‌ను కేరళ పోలీసులు బయటపెట్టారు. ఈ మోసానికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడంలో ప్రధాన మంత్రి ఆంటోనీ అల్బనీస్ ప్రభుత్వం విఫలమైందని ఆస్ట్రేలియా సెనేటర్ మాల్కం రాబర్ట్స్ ఆరోపించారు. భారతదేశంలోని పోలీసులు 22 విశ్వవిద్యాలయాల నుండి 100,000 నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారని, వాటిలో 1 మిలియన్ కంటే ఎక్కువ మంది విదేశాలలో ఉద్యోగాల కోసం ఉపయోగించిన అవకాశం ఉందని ఆరోపించారు.

# తోపు ప్లేయర్లను వదిలి పెట్టి 1000రన్స్ కూడా లేని ప్లేయర్‌ను సెలక్ట్ చేయడం పై దుమారం




న్యూజిలాండ్‌తో మిగిలిన రెండు వన్డేల కోసం భారత సెలక్షన్ కమిటీ అనూహ్య నిర్ణయం తీసుకుంది. గాయం కారణంగా దూరమైన ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఢిల్లీ కుర్రాడు ఆయుష్ బదోనీని జట్టులోకి పిలిచింది. అయితే ఈ ఎంపికపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లిస్ట్-ఏ క్రికెట్‌లో కనీసం 1000 పరుగులు కూడా చేయని ఆటగాడికి జాతీయ జట్టులో చోటు ఎలా ఇస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆకాష్ చోప్రా స్పందిస్తూ.. ఇది ఒక అన్‌పాపులర్ ఛాయిస్ అని కుండబద్దలు కొట్టారు.వాషింగ్టన్ సుందర్ లాంటి ఆఫ్ స్పిన్ వేస్తూ బ్యాటింగ్ చేయగల ఆటగాడు అందుబాటులో లేకపోవడంతో, సెలక్టర్లు బదోనీ వైపు మొగ్గు చూపారు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీలో బదోనీ బ్యాట్‌తో పెద్దగా రాణించకపోయినా (మూడు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 15 పరుగులు), బౌలింగ్‌లో మాత్రం ఆకట్టుకుంటున్నాడు. రైల్వేస్‌పై 3/30, సర్వీసెస్‌పై 1/28 వంటి పొదుపైన గణాంకాలతో ఆకట్టుకున్నాడు. అందుకే సుందర్‌కు సరైన ప్రత్యామ్నాయం దొరకని పరిస్థితుల్లో సెలక్టర్లు ఈ రిస్క్ తీసుకున్నారని ఆకాష్ చోప్రా విశ్లేషించారు.చాలామంది అభిమానులు రియాన్ పరాగ్ లేదా రింకూ సింగ్‌లను ఎందుకు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ఆకాష్ చోప్రా సమాధానమిస్తూ.. రియాన్ పరాగ్ సుదీర్ఘ గాయం తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అతడిని వెంటనే వన్డేల్లోకి దించడం రిస్క్ అని సెలక్టర్లు భావించి ఉండవచ్చు. ఇక రింకూ సింగ్ విషయానికొస్తే.. అతను ప్రధానంగా బ్యాటర్, అప్పుడప్పుడు బౌలింగ్ చేస్తాడు. కానీ టీమిండియాకు ఇప్పుడు సుందర్ లాగా కచ్చితంగా 10 ఓవర్ల స్పెల్ వేయగల లేదా ఉపయోగపడే బౌలర్ కావాలి. అందుకే రింకూ కంటే బదోనీకే ప్రాధాన్యత లభించింది. 27 లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడిన బదోనీ ఇప్పటివరకు 693 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 18 వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు (4.54) చాలా బాగుండటం అతనికి ప్లస్ పాయింట్ అయ్యింది. గతేడాది ఇండియా-ఏ తరఫున సౌతాఫ్రికా పర్యటనలోనూ 66 పరుగులతో రాణించాడు. గణాంకాలు భారీగా లేకపోయినా, అతనిలోని యుటిలిటీని చూసి సెలక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. మరి ఈ సర్ ప్రైజ్ పిలుపును బదోనీ ఎలా ఉపయోగించుకుంటాడో చూడాలి.

# రూ.55 కంటే తక్కువ ధర కలిగిన ఈ స్టాక్ ధనవంతులను చేసింది.. 2000% రాబడి




గత కొన్ని సంవత్సరాలుగా ూవీజు కంపెనీలు స్టాక్ మార్కెట్లో అసాధారణంగా మంచి పనితీరును కనబరిచాయి. కొన్ని కంపెనీలు మల్టీబ్యాగర్లుగా కూడా తమ పనితీరును నిరూపించాయి. తక్కువ సమయంలోనే 500 నుండి 2000 శాతం వరకు రాబడిని అందిస్తున్నాయి. అలాంటి ఒక కంపెనీ గత ఐదు సంవత్సరాలలో 2000 శాతం రాబడిని అందించింది. దాని షేర్లు నేటికీ పెరుగుతున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా ూవీజు కంపెనీలు స్టాక్ మార్కెట్లో బలంగా పనిచేశాయి. కొన్ని కంపెనీలు మల్టీ-బ్యాగర్‌లుగా కూడా మారాయి. అవి తక్కువ సమయంలోనే 500 నుండి 2000 శాతం వరకు రాబడిని ఇచ్చాయి. ఐదు సంవత్సరాలలో పెట్టుబడిదారులకు 2000 శాతం రాబడిని ఇచ్చిన అటువంటి కంపెనీ ఒకటి ఉంది. మంగళవారం నాడు వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ షేరు ధర రెండు శాతం పెరిగింది. కంపెనీ ఇప్పుడు మార్కెట్ నుండి పెద్ద మొత్తంలో నిధులను సేకరించబోతోంది. ఈ స్మాల్-క్యాప్ స్టాక్ దీూజులో 2.62 శాతం పెరిగింది. ఈ స్టాక్ మార్కెట్లో ఒక్కో షేరుకు రూ.54.70కి చేరుకుంది.జనవరి 12, 2026 నాటి నివేదికలో నిధుల సేకరణకు సంబంధించి ప్రత్యేక తీర్మానం ఆమోదించబడిందని కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీలోని మెజారిటీ వాటాదారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని కారణంగా కంపెనీ షేర్లు వెంటనే పెరిగాయి. ప్రమోటర్లు, కంపెనీలోని కొంతమంది ప్రమోటర్లు కానివారు వారెంట్లు జారీ చేస్తారు.గత ఒక నెలలో వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ కంపెనీ వాటా మూడు శాతం పెరిగింది. గత ఒక సంవత్సరంలో ఈ వాటా 6 శాతం పెరిగింది. గత మూడు సంవత్సరాలలో కంపెనీ వాటా 230 శాతం పెరిగింది. గత ఐదు సంవత్సరాలలో ఈ వాటా తుఫాను సృష్టించింది. ఈ వాటా 2,000 శాతం పెరిగింది. అక్షయ్ ఛబ్రా, అఫ్రీన్ ఐ×ూా ప్రమోటర్లు, ూూ మహా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ్రూజజ, కల్లినన్ ఆపర్చునిటీస్ ఇన్కార్పొరేటెడ్ ఎజజ, క్రాఫ్ట్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఫండ్ ్రూజజ ప్రమోటర్లు కానివి, నిధులను సేకరించడానికి వారెంట్లు జారీ చేస్తాయి. అందువల్ల ఈ స్టాక్ రాబోయే రోజుల్లో మళ్ళీ వార్తల్లోకి వస్తుంది.(నోట్: టీవీ9 ఎప్పుడు కూడా స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టాలని సూచించదు. ఎందులోనైనా ఇన్వెస్ట్ చేసే ముందు నిపుణులు, ఆర్థిక సలహాదారులను సంప్రదించడం మంచిది.

# సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన డైరెక్టర్ తేజ్ కొడుకు.. భారీ మొత్తంలో టోకరా



సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు రెచ్చిపోతున్నారు. ప్రజలను మోసం చేస్తూ కోట్లకు కోట్లు నొక్కేస్తున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు అందరూ ఈ సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారు. తాజాగా ఓ దర్శకుడి కొడుకు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. మాయమాటలు చెప్పి ఆ దర్శకుడి కొడుకు దగ్గర ఏకంగా రూ. 63లక్షలు కాజేశారు. ఇంతకూ ఆ దర్శకుడు ఎవరో కాదు ఒకప్పుడు తన సినిమాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న తేజ. పేమ కథ చిత్రాలకు పెట్టింది పేరు తేజ. తన సినిమాలతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నారు తేజ. ప్రస్తుతం ఈ స్టార్ డైరెక్టర్ సినిమాల స్పీడ్ తగ్గించేశారు. తాజాగా తేజ కొడుకు తాజాగా సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు.తేజ కొడుకు అమితవ్ ను కొందరు కేటుగాళ్లు ట్రేడింగ్ లో భారీగా లాభాలు వస్తాయని నమ్మించి ఓ దంపతులు మోసం చేశారు. అమితవ్ వద్ద నుంచి రూ. 63లక్షలు కాజేసినట్లు ఆ దంపతులపై హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సినిమా ఇండస్ట్రీతో సంబంధం లేకుండా బిజినెస్ లో బిజీగా ఉన్నాడు అమితవ్ తేజ. 2025 ఏప్రిల్‌లో మోతీనగర్‌కు చెందిన యార్లగడ్డ అనూష, కొండపనేని ప్రణీత్ దంపతులతో ఆయనకు పరిచయం ఏర్పడింది.ఆతర్వాత అతనికి మాయమాటలు చెప్పి.. ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని, లాభాలు వచ్చేలా చేస్తామని ఒకవేళ నష్టం వస్తే.. తాము నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో ఆ దంపతుల మాటలు నమ్మిన అమితవ్.. రూ. 63 లక్షలు పెట్టుబడిపెట్టారు.అతన్ని నమ్మించడానికి వారం రోజుల తరువాత రూ. 9 లక్షలు లాభం వచ్చిందంటూ ఏవో పేపర్స్ తో బురిడీ కొట్టించారు. దీనిని నిజమని నమ్మిన అమితవ్ భారీగా డబ్బును నేరగాళ్ల చేతిలో పెట్టాడు.

# సినిమా బ్లాక్‌బస్టర్.. కానీ.! వీడు హీరోగా దొరికాడేంటి అనుకున్నా



టాలీవుడ్ ఇండస్ట్రీని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్ఎస్. రాజమౌళి. బాహుబలి 1 ౘ 2, ఆర్ఆర్ఆర్ సినిమాలతో పాన్ వరల్డ్ స్థాయిలో తెలుగు చిత్రపరిశ్రమను నిలబెట్టిన రాజమౌళి.. ప్రస్తుతం మహేష్ బాబుతో కలిసి 'వారాణసి' సినిమా చేస్తున్నాడు. ఇదిలా ఉంటే.. రాజమౌళి గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశాడు. తన తొలి చిత్రం స్టూడెంట్ నెం.1 ప్రజల మైండ్ నుంచి తీయాలనుకుంటున్నట్టు రాజమౌళి అన్నాడు. ఆ సినిమా చూసినప్పుడల్లా క్రింజ్, ఇమ్ మెచ్యూర్‌గా ఉంటుందని తెలిపాడు. తన కెరీర్ తొలినాళ్లలో ఆ సినిమా చేసినప్పటికీ.. దానిపై తాను అసంతృప్తితో ఉన్నట్టు స్పష్టం చేశాడు. అలాగే తనకు ఇష్టమైన సినిమా ఆర్ఆర్ఆర్ అని తెలిపాడు.దివంగత నటులైన ఎన్టీఆర్, సావిత్రితో కలిసి పనిచేయాలన్నది తన కోరిక అని.. వారిద్దరూ ఇప్పుడు జీవించి ఉంటే వారితో కలిసి పని చేయడానికి ఇష్టపడతానని తెలిపాడు. ఆ ఇద్దరి నటనను తాను ఎంతగానో గౌరవిస్తానన్నారు రాజమౌళి. దర్శకుడు రాఘవేంద్ర రావు.. సీనియర్ ఎన్టీఆర్‌కి ఇచ్చిన మాటతో 'స్టూడెంట్ నెం 1' ప్రాజెక్టు తన దగ్గరకు వచ్చిందని రాజమౌళి చెప్పాడు. అప్పటికే యాడ్స్, సీరియల్స్‌లో దర్శకుడిగా, క్రియేటివ్ డైరెక్టర్‌గా విజయాలు అందుకోవడంతో.. ఈ అవకాశం వచ్చిందన్నాడు.7 వైడ్లు, 4 నోబాల్స్.! పిల్లబచ్చా జట్టుపై 17 బంతులు ఓవర్..అప్పటి 'శాంతి నివాసం' సీరియల్ బాధ్యతలను తన సహ దర్శకుడికి అప్పగించి.. తన మొదటి సినిమా మొదలుపెట్టానని రాజమౌళి చెప్పాడు. ఇక జూనియర్ ఎన్టీఆర్‌ను మొదటిసారి చూసినప్పుడు 'ఓరి దేవుడో.! వీడు దొరికాడేంటి.. నా ఫస్ట్ సినిమాకి' అని అనుకున్నానని.. అయితే తనది 'కుంటి గుర్రంతో రేస్ నెగ్గితే ఇంకా గొప్ప కదా' అనే మెంటాలిటీ అని.. హీరో అంత బాగోకపోయినా మనం బాగా తీస్తే ఎక్కువ పేరు వస్తుందని అనుకుని సినిమా మొదలుపెట్టానని చెప్పాడు. సినిమా మొదలైన 10 రోజులకు ఎన్టీఆర్ నటన ఏంటో.? తనలో అద్భుతమైన నటుడిని గుర్తించానని తెలిపాడు. సింహాద్రి లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ కొంత ఇబ్బందులను ఎదుర్కొందని.. ఆంధ్రావాలా, సాంబ, అశోక్, నరసింహుడు లాంటి హై వోల్టేజ్ యాక్షన్ సినిమాలు సింహాద్రి స్థాయికి చేరుకోలేకపోయాయని రాజమౌళి గుర్తు చేశాడు. యమదొంగకు ముందు రాఖీ సినిమా కొంత ఊరటనిచ్చిందని.. ఆ తర్వాత తామిద్దరం చేసిన యమదొంగ సినిమా యాక్షన్ ఓరియెంటేషన్ కాదని, గ్రాఫిక్స్‌తో ఒక కొత్త తరహా చిత్రంగా నిలిచిందని పేర్కొన్నాడు. జూనియర్ ఎన్టీఆర్ తరచుగా తనతో సినిమా తీస్తేనే హిట్లు వస్తాయని అంటాడని, అయితే వారి మధ్య ఉన్న స్నేహం మాత్రం విజయాలతో రాలేదని రాజమౌళి స్పష్టం చేశాడు.

# యశ్ 'టాక్సిక్' సినిమాకు మరో బిగ్ షాక్.




యశ్ 'టాక్సిక్ష సినిమా టీజర్ ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. టీజర్ హాలీవుడ్ లెవెల్ లో ఉందని ప్రశంసలు వినిపిస్తున్నప్పటికీ, అనవసరమైన రొమాంటిక్ సీన్లు జోడించారని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. వీటన్నిటి మధ్య టాక్సిక్ సినిమా వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం (జనవరి 12) 'టాక్సిక్ష సినిమాపై కొందరు మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఇదే సినిమా విషయంలో కొందరు సెన్సార్ బోర్డు (జదీఖీజ) కు కూడా ఫిర్యాదు చేశారు. 'టాక్సిక్ష సినిమా టీజర్‌లో అశ్లీల, అనైతిక సన్నివేశాలు ఉన్నాయన్నది చాలా మంది ఫిర్యాదు. ఈ నేపథ్యంలోనే టాక్సిక్ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త దినేష్ కల్లహల్లి సెన్సార్ బోర్డు (జదీఖీజ)కి ఫిర్యాదు చేశారు. టీజర్‌లో అశ్లీల దృశ్యాలు ఉన్నాయని, ఇవి మైనర్లపై చెడు ప్రభావం చూపుతాయని దినేష్ కల్లహల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సినిమా టీజర్ సామాజిక నైతికత హద్దులు దాటిందని, కాబట్టి ఈ సన్నివేశాలను వెంటనే తొలగించాలని, సినిమా దర్శక, నిర్మాతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దినేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.'టాక్సిక్ష సినిమాపై కర్ణాటక ఆప్ మహిళా విభాగం మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సినిమా టీజర్‌లోని కొన్ని సన్నివేశాలు అశ్లీలంగా ఉన్నాయని ఆప్ ఆందోళన వ్యక్తం చేసింది. ఎటువంటి వయస్సు హెచ్చరిక లేకుండా పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేసిన ఈ దృశ్యాలు మహిళల గౌరవాన్ని కించపరిచేవిగా, కన్నడ సంస్కృతిని అవమానించేవిగా ఉన్నాయని ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ మండి పడ్డారు. సినిమా టీజర్ యూట్యూబ్ లో రికార్డులు బద్దలు కొడుతోంది. ఈ చిత్రానికి గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి కథనాయికలుగా నటించారు.

# అందరితో నటించా కానీ ఆ ఇద్దరు హీరోలతో చేయలేదు




ఒకప్పుడు హాట్ బ్యూటీగా ఇండస్ట్రీని ఊపేసింది ముమైత్ ఖాన్.. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసి మెప్పించింది. ఇటీవల కాలంలో ముమైత్ ఖాన్ పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. ఆ మధ్య తెలుగు బిగ్ బాస్ షోలో సందడి చేసింది. రీసెంట్ గా ఓ డ్యాన్స్ షోకు జడ్జ్ గా వ్యవహరించింది. తర్వాత బుల్లితెర నుంచి కూడా మాయం అయ్యింది. తాజాగా ముమైత్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో ముమైత్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఓ స్టార్ హీరో గురించి ముమైత్ చేసిన కామెంట్స్‌ముమైత్ ఖాన్ మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణపై తనకు అపారమైన అభిమానం ఉందని, ఆయన ఎనర్జీ అద్భుతమని ముమైత్ ఖాన్ చెప్పుకొచ్చింది. బాలకృష్ణను చాలామంది అపార్థం చేసుకుంటున్నారని, కానీ ఆయన గొప్ప వ్యక్తి అని ఆమె అన్నారు. బాలకృష్ణ గురించి మాట్లాడుతూ.. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి పూజలు, యోగా చేస్తారని, జ్యోతిష్యాన్ని నమ్ముతారని, క్రమశిక్షణతో ఉంటారని ముమైత్ ఖాన్ తెలిపింది. డిక్టేటర్ చిత్రంలోని టింగో టింగో టింగో పాట సమయంలో బాలకృష్ణతో కలిసి పనిచేశానని ఆమె గుర్తుచేసుకున్నారు. అలాగే పూరి జగన్నాథ్‌తో తన ప్రయాణం సి.కళ్యాణ్ సిఫార్సుతో ప్రారంభమైందని ముమైత్ ఖాన్ వెల్లడించారు.హరికృష్ణ నటించిన స్వామి చిత్రంలోని తన మొదటి పాట కు జ. కళ్యాణ్ తన పనిని మెచ్చుకున్నారని, ఆ తర్వాత పూరి జగన్నాథ్ తన తమ్ముడుతో తీస్తున్న 143 చిత్రానికి తనను సిఫార్సు చేశారని తెలిపింది ముమైత్. పూరి జగన్నాథ్ వర్క్ స్టైల్ ముంబై శైలిలో ఉంటుందని, అది తనకు ఎంతో నచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పూరి జగన్నాథ్‌తో తాను రోజూ టచ్‌లో లేనప్పటికీ, కలిసినప్పుడు స్నేహం అలాగే కొనసాగుతుందని ముమైత్ ఖాన్ అన్నారు. తన దృష్టిలో నిజమైన స్నేహం అంటే రోజూ మాట్లాడుకోవటం కాదని, ఎప్పుడు కలిసినా మునుపటి అనుబంధం అలాగే ఉండటమేనని ఆమె అన్నారు. టాలీవుడ్‌లోని దాదాపు అందరు హీరోలతో తాను కలిసి పనిచేశానని, మోహన్ బాబు, నాగార్జున వంటి కొందరు సీనియర్ నటులు మినహా మిగిలిన అందరితో తాను పనిచేశానని ముమైత్ ఖాన్ తెలిపారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్‌లతో చేయలేదని ఆమె అన్నారు. అలాగే తాను సినిమా రంగంలోకి డబ్బు అవసరం కోసం రాలేదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నానని ఆమె అన్నారు. ఇంట్లో ఆర్థిక కష్టాలను చిన్నతనం నుంచే గమనించి, స్కూల్‌కు నడిచి వెళ్లి రూపాయిన్నర ఆదా చేసి, ఆ డబ్బును తన తండ్రికి ఇచ్చేదానినని ముమైత్ ఖాన్ గుర్తుచేసుకున్నారు. తన తల్లిదండ్రులు ఎప్పుడూ పని చేయమని చెప్పనప్పటికీ, తానే కుటుంబానికి అండగా నిలిచానని ఆమె చెప్పుకొచ్చారు.

# ఆ ఇద్దరు హీరోలే నాకు ఆదర్శం



అనగనగా ఒక రాజు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను గ్రాండ్ గా నిర్వహించారు. అనగనగా ఒక రాజు ప్రీ-రిలీజ్ వేడుక వరంగల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. గతంలో జాతి రత్నాలు ప్రీ-రిలీజ్ ఈవెంట్ సమయంలో వరంగల్ ప్రజలు ఇచ్చిన ప్రోత్సాహం, ఎనర్జీని గుర్తుచేసుకున్నారు. ఆ మద్దతుతోనే బుక్ మై షోలో టికెట్లు వేగంగా అమ్ముడయ్యాయని అన్నారు నవీన్ పోలిశెట్టి. అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ గురించి మాట్లాడుతూభీమవరం నుంచి ప్రారంభించి ఆంధ్ర, తెలంగాణలోని అనేక ప్రాంతాలకు వెళ్ళమని చెప్పారు. సినిమా విడుదల తర్వాత అమెరికా టూర్‌కు కూడా వెళ్లనున్నట్లు తెలిపారు. తన సినిమాలకు మార్కెటింగ్ చేసేది ప్రేక్షకులేనని, తన జర్నీలో ప్రతి సినిమాకు వర్డ్ ఆఫ్ మౌత్ చాలా బలంగా పనిచేసిందని నవీన్ అన్నారు. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సమయంలో పది షోలు కూడా దొరకని పరిస్థితి నుంచి ప్రేక్షకుల మద్దతుతో సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యిందని అన్నారు నవీన్. ప్రేక్షకులు చూపించిన ప్రేమ, అభిమానం తనకు డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే స్ఫూర్తి ని ఇచ్చాయని, ఆ తర్వాతే అనగనగా ఒక రాజు కథ రాశారు అని నవీన్ తెలిపారు. ఈ సినిమాలో ఆకట్టుకునే వినోదంతో పాటు, రెండవ భాగంలో ఒక అందమైనఎమోషనల్ డ్రామా కూడా ఉందని నవీన్ అన్నారు. జనవరి 14న టికెట్లు బుక్ చేసుకుని థియేటర్లకు పొలిశెట్టి స్పష్టం చేశారు. లేకపోయినా, నాకు బ్యాక్‌గ్రౌండ్‌లో చాలా మంది కుటుంబాలు (అభిమానులు) ఉన్నారు అని నవీన్ అన్నారు. ఈ కుటుంబాలందరినీ తన చివరి శ్వాస వరకు అలరించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. తన గురువు చిరంజీవి గారి హుక్ స్టెప్ ఈ సంక్రాంతికి థియేటర్లలో ఒక కొత్త ఎనర్జీని నింపిందని నవీన్ అన్నారు. 90లలో గ్యాంగ్ లీడర్ చిరంజీవి గారిని చూసి ఎలా కేరింతలు కొట్టేవారో, అలాంటి ఎనర్జీని ఆయన థియేటర్లలో తిరిగి తీసుకొచ్చారని అన్నారు. అదే శక్తిని కొనసాగిస్తూ, జనవరి 14న అనగనగా ఒక రాజు లాంటి వారే అని తాను మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి హీరో అవ్వాలనుకున్నప్పుడు తన కళ్ళ ముందు కనిపించిన పేర్లు చిరంజీవి, రవితేజ అని అన్నారు..

# 100 కోట్లు దాటేసిన 'మన శంకరవరప్రసాద్




మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటెస్ట్ సినిమా మన శంకరవరప్రసాద్ గారు. అపజయమెరుగని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్ టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షోతోనే బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. మొదటి రోజే ఏకంగా రూ. 84 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి మెగాస్టార్ పవరేంటో మరోసారి ప్రూవ్ చేసింది. తాజాగా మన శంకరవరప్రసాద్ గారు సినిమా రూ. 100 కోట్ల క్లబ్ లో చేరిపోయింది. రెండు రోజులకు కలిపి మెగా మూవీ మొత్తం రూ. 120 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టర్ ను విడుదల చేశారు మేకర్స్. మూవీకి పాజిటివ్ టాక్ రావడం, సంక్రాంతి పండగ సెలవులు రావడంతో రాబోయే రోజుల్లో మన శంకరవరప్రసాద్ గారు సినిమా కలెక్షన్లు మరింత పెరిగే అవకాశముందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా మన శంకరవరప్రసాద్ గారు మూవీని నిర్మించారు. నయనతార కథనాయికగా నటించగా విక్టరీ వెంకటేష్ మరో కీలక పాత్రలో ఆకట్టుకున్నారు. క్యాథరీన్ థెరీసా, సచిన్ ఖేడ్కర్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠం, శరత్ సక్సేనా తదితరులు వివిధ పాత్రల్లో మెరిశారు. భీమ్స్ అందించిన స్వరాలు ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా హుక్ స్టెప్ సాంగ్ కు థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి.కాగా ఓవర్సీస్ లోనూ మన శంకరవరప్రసాద్ గారు సినిమాకు భారీ కలెక్షన్లు వస్తున్నాయి. నార్త్ అమెరికాలో ఫస్ట్ డే నే 1.7 మిలియన్ డాలర్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు తెలుస్తోంది. ఇక ప్రీమియర్లలోనే వన్ మిలియన్ డాలర్లు కలెక్ట్ చేసిన చిరు రెండో చిత్రంగా నిలిచింది. ఇక రెండో రోజు కూడా భారీ వసూల్లు వచ్చినట్లు తెలుస్తోంది.

Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209,
Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com